ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 17.10.2026 | సంపుటి :13 సంచిక : 88 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ముఖ్యమంత్రి రేవంత్‌తో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో, కంపెనీ ప్రతినిధులు, అధికారులు,

# హైదరాబాద్‌కు హ్యుందాయ్

రాష్ట్రంలో కార్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయండి.. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉంది. పరిశ్రమల ఏర్పాటుకు దేశంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ అన్నివిధాలుగా అను కూలమైన ప్రాంతం. ఫ్యూర్ ప్రాంతంలో మ్యానుఫ్యాక్చర్ రంగం అభివృద్ధిని సర్కార్ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుంది. - సీఎం రేవంత్

## పెండింగ్ అనుమతులు త్వరగా పూర్తి చేయండి

- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- కంపెనీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి భేటి
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి త్వరలోనే భూమిపూజ
- తెలంగాణలో తయారీ రంగానికి అన్ని విధాలా సహకరిస్తామని సీఎం హామీ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫాక్చరింగ్ జోన్‌లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి... అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హ్యుందాయ్

మిగతా 2లో..

# కాక్రోచ్ చీఫ్ దీప్కే అరెస్టు

తిరంగా యాత్రకు అనుమతిలేదు : కేంద్రం

## నిరసన ప్రదేశంలో కఠిన ఆంక్షలు



దీప్కేను అదుపులోకి తీసుకున్న పోలీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి): లెహ్రా దో తిరంగా పేరుతో శుక్రవారం సాయంత్రం ర్యాలీ చేపట్టాలని సీజేపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఢిల్లీ పోలీసులు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, ఈ ర్యాలీకి వెళ్తున్న ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను కూడా ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీప్కేను ఢిల్లీ, ఝుండేవాలన్‌లోని నివాసం నుంచి అదుపులోకి తీసుకోగా.. నేహా బోరాను మండి హౌజ్ నుంచి అరెస్టు చేశారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకుంటున్న సమయంలో ఉద్రిక్తత తలెత్తింది. అటు పోలీసులు, ఇటు మీడియా.. మధ్యలో దీప్కే మద్దతుదారులతో ఈ ప్రదేశంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీప్కేను పోలీసులు అరెస్టు చేసి, తమ వాహనంలో తీసుకుని వెళ్లారు. అంతకుముందు దీప్కేకు ఢిల్లీ పోలీసులు రెండు వేర్వేరు నోటీసులు ఇచ్చారు. సెంట్రల్ పార్క్ వద్ద దీక్షకు వెళ్లకూడదని సూచిస్తూ.. ఢిల్లీ పోలీస్ యాక్ట్ కింద పోలీసులు ఒక నోటీస్ జారీ చేశారు. అనంతరం.. బీఎన్ఎస్ సెక్షన్ 163 కింద సౌత్ వెస్ట్ ఢిల్లీ పోలీసులు మరో నోటీస్ జారీ చేశారు. ఈ సమయంలో దీప్కే నివాసం వద్ద భారీ స్థాయిలో పోలీసులు మోహరించారు. తన అరెస్టు సమయంలో దీప్కే పోలీసులతో ఘర్షణకు దిగారు. సెంట్రల్ పార్క్ వద్ద ఆందోళన చేయడానికి వీల్లేదన్న పోలీసులతో.. మరో చోటును చూపించాల్సిందిగా కోరాడు. మరో ప్రదేశం గురించి తర్వాత చెబుతామని, ఇప్పుడు

మిగతా 2లో..

## ఢిల్లీలో మళ్లీ భద్రత కట్టుదిట్టం

2లో..

- మళ్లీ రక్షణ వలయంలోకి దేశరాజధాని
- 6 వేలమంది ఢిల్లీ పోలీసులు, 220 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను మోహరింపు
- పార్క్ మూసివేతపై అత్యవసర విచారణకు సుప్రీం నో





# ప్రభుత్వానికి ముందుచూపు లేదు

- కరెంటు, నీటి సమస్యకు కాంగ్రెస్ పాలనా వైఫల్యమే కారణం
- కమీషన్ల కోసమే సింగరేణిలో ఉత్పత్తి తగ్గింపు
- దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించండి.. కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్ (జనంసాక్షి):సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ అర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి నిండా కుంభకోణాలు ఉన్నాయి అని నేను చెప్పిన. కాంగ్రెస్ చేసిన కుంభకోణాలని ప్రజల ముందు పెడితే రేవంత్ రెడ్డి నిన్న అడ్డగోలుగా మాట్లాడిండు. నువ్వు ఉత్తరం రాస్తే నేను విచారణకు ఆదేశిస్తా అన్నాడు. ఎమీడియా ముందు మాట్లాడుడు కాదు, దమ్ముంటే సింగరేణి కుంభకోణం పైన ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపైన విచారణ సిట్టింగ్ జడ్జితో చేయించాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. బొగ్గు అంశంలోనే కాదు, దమ్ముంటే నువ్వు చేసిన అక్రమాలపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు. నీ బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన 10వేల కోట్ల కుంభకోణంపై

మిగతా 2లో..

# 3 నెలల్లో 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు'

## అందుకు సంబంధించిన ముసాయిదా సిద్ధం చేయాలి

- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు
- విద్యార్థుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- న్యాయ, విద్యా, హోంశాఖలు, యూజీసీ భాగస్వామ్యంతో కసరత్తు
- సచివాలయంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం
- హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి

హైదరాబాద్(జనంసాక్షి): విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు'కు సంబంధించిన ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ (సీఎస్‌సీ)కి సమర్పించాలని స్పష్టం చేశారు. కమిటీ ఏర్పాటు నుంచి వివిధ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని,

మిగతా 2లో..



రూబియో భారత పర్యటన..

# గందరగోళంలో విదేశాంగశాఖ

## కేంద్రంపై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఈ పర్యటనపై భారత విదేశాంగ శాఖ అధికారులు గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. అంతేకాదు.. విదేశాంగ మంత్రి జైశంకర్‌ను.. పరోక్షంగా 'రూబియో సిబ్బంది' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. రూబియో పర్యటనపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురువారం మాట్లాడారు. తమ విదేశాంగ మంత్రి ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశం కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో జైశంకర్ పాల్గొంటారని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "రూబియో తన సిబ్బందిని ముంబయికి రావాలని

మిగతా 2లో..

## రాహుల్ బెదిరింపులకు మోదీ ప్రభుత్వం భయపడదు

2లో..

కేంద్రాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారు: కిషన్‌రెడ్డి



# ఆంధ్రాలో ఘోర విషాదం

జలాశయంలో మునిగి ఐదుగురు మహిళలు మృతి

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలో ఘటన

ప్రమాదంపై సీఎం చంద్రబాబుగ్భ్రాంతి

పెనుకొండ(జనంసాక్షి): శ్రీ సత్యసాయి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పెనుకొండ మండలం గొల్లపల్లి జలాశయంలో ప్రమాదవశాత్తు మునిగిపోయి ఐదుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. దర్గాపేటకు చెందిన గాయత్రి (50), ఆమె కుమార్తె అశ్విని, ఇరుగుపొరుగు స్నేహితులు పుష్ప, హాసీనా, మహిన్‌తో కలిసి

మిగతా 2లో..

డీలిమిటేషన్, మహిళా బిల్లుల ఆమోదానికి..

# పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

ఈ నెలాఖరులో నిర్వహించే అవకాశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ

మిగతా 2లో..

### కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి

ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే లేఖ

2లో..



## పోటీకి భయపడేది లేదు

మస్క్‌కు రిలయన్స్ కౌంటర్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌లో స్టార్‌లింక్ రాకను కొందరు బడా వ్యాపారవేత్తలు అడ్డుకుంటున్నారని, భారత ప్రధాని ముఖేశ్ అంబానీ అంటూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యాఖ్యలపై తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పందిస్తూ మస్క్‌కు గట్టిగా బదులిచ్చింది. స్టార్‌లింక్ రాకను స్వాగతిస్తున్నామని, పోటీకి తాము ఏమాత్రం భయపడబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. "భారత మార్కెట్, రిలయన్స్

మిగతా 2లో..



# వీలైనంత త్వరలో అమెరికాతో ట్రేడ్‌డీల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. ఇరు పక్షాల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా.. కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. వీలైనంత త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచ వాణిజ్యం సహా ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని.. ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. అగ్రరాజ్యంతో

మిగతా 2లో..

## నిర్మల కీలక వ్యాఖ్యలు



# కెనడా విచ్ఛిన్నానికి ట్రంప్ కుట్ర



ఆ దేశ ప్రధాని కార్నీ సంచలన వ్యాఖ్యలు

ఒట్టావా(జనంసాక్షి): తమ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అమెరికా ప్రయత్నిస్తోందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కెనడా ప్రావిన్స్ అల్బెర్టాలో వచ్చే సోమవారం రిఫరెండం జరగనున్న నేపథ్యంలో ప్రచార ర్యాలీలో కార్నీ మాట్లాడారు. అల్బెర్టా కెనడాలో భాగంగా ఉండేలా ఆ ప్రావిన్స్ ప్రజలు ఓటు వేయాలని కోరారు. అందుకు భిన్నంగా జరిగితే..

మిగతా 2లో..



# ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి

- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్

**సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 16 (జనం సాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలతో పాటు తాగునీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీతతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో సాగవుతున్న పత్తి, కంది, టమాట పంటలను పరిశీలించి, రైతు బాల్‌రెడ్డితో మాట్లాడి పంటల పరిస్థితి, నీటి లభ్యత, సాగు వివరాలను తెలుసుకున్నారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి రైతు పొలంలో వ్యవసాయ నీటి కుంటలు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలని తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వీబీ–జీ రామ్‌జీ పథకం కింద లభించే పనిదినాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని, అవసరమైన చోట పంట విరామం పాటించేలా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రానున్న రోజుల్లో ఎదురయ్యే నీటి సమస్యలపై ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలవారీగా పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు అందించాలని, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల స్థాయి, బోర్లలో నీటి లభ్యత, విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను అంచనా వేసి, సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నీటి వృథాను అరికట్టేందుకు జల వనరుల కమిటీలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయిలో నీటి సంరక్షణకు సంబంధించిన తీర్మానాలు చేయించాలని తెలిపారు. విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు ప్రతి వారం సంయుక్త సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల అదనపు కలెక్టర్లు సంగీత, లక్ష్మి కిరణ్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి, గుమ్మడిదల తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రసాద్ ల్యాబ్స్‌లో 'పండుగ సాయన్న' ఆడియో ఆవిష్కరణ

- పండుగ సాయన్న చరిత్రను, పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించిన 'పండుగ సాయన్న' ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొని పండుగ సాయన్న ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చరిత్రను, ఆయన ధైర్యసాహసాలను, పోరాట పటిమను, ప్రజల కోసం చేసిన సేవలను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు పేర్కొన్నారు. పండుగ సాయన్న జీవిత విశేషాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఆయన స్ఫూర్తిని యువతకు అందించాలని ఆకాంక్షించారు. తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన పండుగ సాయన్న వీరగాథను విస్తృతంగా ప్రచారం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న విగ్రహ కమిటీ సభ్యులు, ముదిరాజ్ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# పంటల కొనుగోలు ప్రక్రియకు లారీల యజమానులు సహకరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** జిల్లాలో పత్తి, వరి తదితర పంటల కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు లారీల యజమానులు, జిల్లా లారీ అసోసియేషన్ ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పంటల కొనుగోలు కేంద్రాల నుంచి పంటలను తరలించే రవాణా ప్రక్రియలో, కొనుగోలు కేంద్రాల వద్ద లారీలను అందుబాటులో ఉంచడం, అవసరమైన సమయంలో రవాణా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలలో లారీల యజమానులు సహకరించాలని, పంటల కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పంటల కొనుగోలు, రవాణా ప్రక్రియలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు కలిగించినట్లయితే సంబంధిత వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. పంటల కొనుగోలుకు అవసరమైన రవాణా సదుపాయాలను సమకూర్చే క్రమంలో, అవసరాన్ని బట్టి ఇతర ప్రాంతాల నుంచి లారీలను జిల్లాలోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా లారీ అసోసియేషన్ ప్రతినిధులు, లారీల యజమానులు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.

# యూనిఫామ్‌లో రీల్స్, ఈవెంట్లు ఇక చెల్లవ్

## డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

- ఉల్లంఘించిన సిబ్బందిపై చర్యలు
- పోలీసు యూనిఫామ్ గౌరవం, బాధ్యతలకు ప్రతీక
- ప్రైవేట్ కార్యక్రమాల్లో డ్యాన్సులు, విన్యాసాలపై ఆగ్రహం
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలపై హెచ్చరికలు జారీ



**రంగారెడ్డి, అక్టోబర్ 16 (జనంసాక్షి):** రాష్ట్రంలో పోలీస్ శాఖ గౌరవాన్ని, క్రమశిక్షణను కాపాడే దిశగా పోలీసు బాస్ కఠిన నిర్ణయం తీసుకున్నారు. పోలీస్ యూనిఫామ్‌ను ధరించి నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే సిబ్బందిపై డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫామ్‌లో ఉండి రీల్స్ చేయడం, ప్రైవేట్ ఈవెంట్లు లేదా వివాహాది వేడుకల్లో డ్యాన్సులు చేయడం వంటి చర్యలపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొంతకాలంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కొందరు పోలీస్ సిబ్బందికి సంబంధించిన వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి. పోలీస్ యూనిఫామ్‌లోనే ఉన్న కొంతమంది సిబ్బంది వివిధ కార్యక్రమాలలో డ్యాన్సులు వేయడం, విన్యాసాలు చేయడం వంటి దృశ్యాలు నెట్టింట్లో హల్‌చల్ చేశాయి. ఈ వీడియోలపై ప్రజాసంఘాల నుంచి, మేధావుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. యూనిఫామ్ ధరించి ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల పోలీస్ శాఖ ప్రతిష్ట మసకబారుతోందంటూ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే డీజీపీ ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్నారు.

### క్రమశిక్షణే పోలీసుకు కొలబద్ద

పోలీసు వ్యవస్థకు మూలస్తంభం క్రమశిక్షణ అని, యూనిఫామ్ కేవలం ఒక దుస్తుల రూపం మాత్రమే కాదని, అది బాధ్యతకు, అధికారానికి, ప్రజల నమ్మకానికి ప్రతీక అని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. విధుల్లో ఉన్నప్పుడు, యూనిఫామ్ ధరించినప్పుడు దాని పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పోలీసు సిబ్బందిపై ఉంటుందని గుర్తు చేశారు. వ్యక్తిగత, ప్రైవేట్ కార్యక్రమాలకు హాజరైనప్పుడు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని తేల్చిచెప్పారు.

### ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు..

డ్యూటీ సమయంలో కానీ, యూనిఫామ్‌లో ఉన్నప్పుడు కానీ శాఖా పరమైన నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తూ.చా తప్పకుండా పాటించాలని డీజీపీ హెచ్చరించారు. ఇకపై ఎవరైనా సరే యూనిఫామ్‌ను ధరించి డ్యాన్సులు చేయడం, ప్రైవేట్ ఈవెంట్లలో నిబంధనలను ఉల్లంఘించడం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి సిబ్బందిని గుర్తించి తక్షణమే కఠినమైన క్రమశిక్షణా చర్యలు (డిసిప్లినరీ యాక్షన్) తీసుకుంటామని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ హెచ్చరికలతో పోలీసు శాఖలో, సోషల్ మీడియాలో ఈ అంశంపై మళ్లీ తీవ్ర చర్చ నడుస్తోంది. శాఖ గౌరవాన్ని కాపాడేందుకు ఉన్నతాధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తున్నారు.

# బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

- మహిళా జర్నలిస్టులతో కలిసి బతుకమ్మ ఆడి పాడిన మంత్రి సీతక్క
- సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మహిళా జర్నలిస్టులతో కలిసి బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా బతుకమ్మ ప్రాధాన్యతను, తెలంగాణ సంస్కృతి–సంప్రదాయాల్లో దాని విశిష్టతను వివరించారు. బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. ప్రకృతిని పూజిస్తూ, పూలను కొలుస్తూ జీవన సౌందర్యాన్ని చాటే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. బతుకమ్మ మన సంస్కృతి, మన సంప్రదాయం, మన తెలంగాణ అస్తిత్వానికి ప్రతిబింబమని అన్నారు. ఆడబిడ్డల ఆనందం, మహిళల ఐక్యత, తెలంగాణ ఆత్మీయత కలగలిసిన పండుగగా బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తంగేడు, గునుగు తదితర పూలతో పేర్చే బతుకమ్మలో తెలంగాణ మట్టి పరిమళం కనిపిస్తుందని చెప్పారు. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం అనే గొప్ప సందేశాన్ని బతుకమ్మ మనకు అందిస్తుందని వివరించారు. కులమతాలకు అతీతంగా మహిళలంతా ఒకే చోట చేరి ఆనందంగా సంబరాలు చేసుకోవడం బతుకమ్మ ప్రత్యేకత అని మంత్రి సీతక్క అన్నారు. బతుకమ్మ పాటల్లో తెలంగాణ పల్లె జీవితం, మహిళల కష్టసుఖాలు, మన నేల సంస్కృతి ప్రతిధ్వనిస్తాయని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళల గౌరవం, ఆడబిడ్డల సంతోషం, ప్రకృతి పరిరక్షణకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పూల పండుగ బతుకమ్మ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మన పండుగలను కాపాడుకోవడం అంటే మన మూలాలను, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమేనని అన్నారు. బతుకమ్మ బతుకు సందేశాన్ని అందిస్తూ, ఐక్యతను చాటుతూ తెలంగాణ గర్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో మహిళా జర్నలిస్టులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.

# వ్యక్తిగత కక్షలతో గొడ్డలితో దాడి

- ముగ్గురిపై కేసు నమోదు

**గీసుకొండ, అక్టోబర్ 16, (జనంసాక్షి) :** వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన ఘటన గీసుగొండ మండలం నందనాయక్ తండాలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన అజ్మీరా వెంకటేష్ (33) తమ గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడనే కారణంతో బూక్యా నాగరాజు, శంకర్, సింహాద్రి గురువారం సాయంత్రం అతనితో గొడవకు దిగారు. ఈ క్రమంలో నాగరాజు గొడ్డలితో వెంకటేష్ తలపై దాడి చేయడంతో గాయమై రక్తస్రావమైంది. అనంతరం వెంకటేష్ భార్య అనుషను సైతం దూషించి, చేతులతో కొట్టి బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అని సి ఐ డి విశ్వేశ్వర్ తెలిపారు.

# తక్కువ తడులతో సాగయ్యే పంటలు వేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 16,(జనంసాక్షి) :** ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ తడులతో సులభంగా సాగయ్యే పంటలను మాత్రమే వేసేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అధికారులతో వ్యవసాయ సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు అంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులకు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలి

- జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టి లో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు పంట నష్టాలను నివారించడంతో పాటు ఆర్థికంగా లాభాలు పొందవచ్చని తెలిపా రు. స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి గ్రామంలో గల రైతు వేదికలో శు క్రవారం వ్యవసా య శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడి పై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథి గా హాజరయి మాట్లాడుతూ పసిఫిక్ మహాసము ద్రంలోఏర్పడే ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతుంద ని, దీనివల్ల వర్షపాతం తగ్గడంతో పాటు ఉష్ణోగ్రత లు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. తద్వారా వ్యవసాయ రంగంలో అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలుతీసుకోవాలని సూచించారు. జిల్లాలో అక్టోబర్ 16వ తేదీ నాటికి సాధారణంగా 800 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 520 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని తెలిపారు. వర్షపాతంలో లోటును దృష్టిలో ఉంచుకొని రైతు లు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని,వరికి బదులుగా శనగ, కంది, పెసర, తదితర పప్పుధాన్యాలు, నూనెగింజల పంటల ను సాగు చేయాలని తెలిపారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవం తంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. బోర్లు,బోరుబావుల్లో సాగునీటిలభ్యత తగ్గుతున్న నేపథ్యంలో రైతులు నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రైతులు ఉద్యాన పంటల సాగుపై కూడా దృష్టిసారించాలని సూచిం చారు. బత్తాయి, కొబ్బరి, జామ, సీతాఫలం వంటి ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని తెలిపారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని సూచిం చారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా రైతులు కూరగాయల సాగు ను చేపట్టడం ద్వారా నిరంతర ఆదాయం పొందే దుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రైతు లకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువు లు, వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం సబ్సిడీ పై అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏఓ అంబికా సోనీ, ఏడీఏ అపర్ణ, జిల్లా పశుసం వర్ధక శాఖ అధికారి మురళీధర్ రావు, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, ఏసీపీ భీం శర్మ, ఎంపిడిఓ విజయశ్రీ, మండల వ్యవసాయ అధికారి కర్ణాకర్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల్లో 70 శాతం స్థానికులకే ఇవ్వాలి

- రాష్ట్ర కార్మిక,గనుల శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి



**హత్నూర అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ఆయా ప్రాంతాల్లో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానికులకు డెబ్బై శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వివిధ పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. మండలంలోని గుండ్ల మాచునూరు గ్రామం పెద్ద చెరువు కట్టపై హానర్ ల్యాబ్ పరిశ్రమ సహకారంతో రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన బతుకమ్మ ఘాట్ ను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీహరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలంతా పార్టీ జెండాలు పక్కనపెట్టి ఐక్యమత్యంతో ముందుకు వెళ్తూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని స్పష్టం చేశారు. పెద్ద చెరువు అలుగు పై బ్రిడ్జి నిర్మాణంతో పాటు మినీ స్టేడియంకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు మంత్రిని కోరగా వారు సానుకూలంగా స్పందించారు. డిసిసి మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డిలు మాట్లాడుతూ పరిశ్రమలు నెలకొల్పబడిన గ్రామాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ మండలంలోని ఇతర గ్రామాల అభివృద్ధికి సైతం కొన్ని సిఎస్ఆర్ నిధులను కేటాయించాలని వారు చెప్పారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ విద్యారంగంలో వెనుకబడి ఉన్న గ్రామ యువత ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి,హానర్ ల్యాబ్ పరిశ్రమ ప్రతినిధులు పార్థసారథి,రత్నాకర్,అరుణ్,వేణుగోపాల్,హెచ్ ఆర్ సుభాష్ రెడ్డి,కోవలెంట్ పరిశ్రమ ప్రతినిధి రాఘవరెడ్డి, హెచ్ ఆర్ విష్ణువర్ధన్ రెడ్డి,లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి,బిజెపి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్,అంబేద్కర్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కొండాపూర్ జగన్,తహసిల్దార్ ఫర్వీన్ షేక్,ఇన్చార్జి ఎంపీడీవో యూసుఫ్ పాల్గొన్నారు.

సంపాదకీయం

## మొసలికి భయపడని పాలకుడు..

# బొద్దింకలంటే ఎందుకీ భయం?

బాల్యంలో చెరువులోంచి మొసలి పిల్లను పట్టుకొచ్చానని చెప్పుకున్న ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో, ఇప్పుడు నిరసన గళాలే సవాలుగా మారుతున్నాయా? బలవంతుడిని ఎదుర్కోవడం ధైర్యమైతే, తనను ప్రశ్నించే సామాన్యుడి గొంతును సహనంతో వినడం అంతకంటే గొప్ప ధైర్యం. పాలకుడి ప్రజాస్వామిక నిబద్ధతకు అసలైన పరీక్ష అక్కడే!

ఢిల్లీలోని జంతర్ మంతర్ దశాబ్దాలుగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, బాధితులు తమ గోడు వినిపించే ప్రజాస్వామిక వేదికగా నిలిచింది. అలాంటి నిరసన స్థలాన్ని అక్టోబర్ 11న ఢిల్లీ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులతో డీనోటిఫై చేయడం, ఆ తర్వాత అక్కడ నిరసనకు ప్రయత్నించిన కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు ఆశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామిక వర్గాల్లో ఆందోళనకు దారితీసింది. అక్టోబర్ 16న అభిజీత్ దీప్కేను మరో నిరసనకు వెళ్లకుండా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.

నిరసనకు ఒక స్థలాన్ని కేటాయించడం వేరు.. నిరసనకు చారిత్రక చిరునామాగా నిలిచిన స్థలాన్నే మూసివేయడం వేరు. భద్రత, ట్రాఫిక్, శాంతిభద్రతల పేరుతో పరిమితులు విధించవచ్చని అధికారులు వాదించవచ్చు. కానీ ఆ పరిమితులు ప్రజల నిరసన హక్కును నిర్వీర్యం చేసేలా ఉండకూడదు. చట్టాన్ని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యతే; అదే సమయంలో రాజ్యాంగ హక్కులను కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత.

రాజ్యాంగంలోని 19వ అధికరణం భావ ప్రకటనా స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును కల్పిస్తోంది. ఈ హక్కులకు సహేతుకమైన పరిమితులు ఉన్నప్పటికీ, ప్రతి విమర్శనూ శాంతిభద్రతల సమస్యగా చూడటం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అనుమతి నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణ ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ ప్రతి చర్యకు స్పష్టమైన కారణం, పారదర్శకత, న్యాయపరమైన సమీక్ష ఉండాలి.

నిరసనకారులపై ఆంక్షలు విధించినంత మాత్రాన ప్రజల్లోని అసంతృప్తి అంతరించిపోదు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ప్రశ్నించే గొంతులను అడ్డుకుంటే, పాలనపై విశ్వాసం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఎంత బలంగా ఉందో కొలిచేది దాని విమర్శకుల సంఖ్య కాదు.. విమర్శలను ఎంత సహనంతో స్వీకరిస్తుందన్నదే.
మొసలిని పట్టుకున్నానని చెప్పుకునే నాయకుడికి బొద్దింకలుగా తమను తాము అభివర్ణించుకుంటున్న యువ నిరసనకారులంటే భయమెందుకు? జంతర్ మంతర్ గేట్లు మూసివేయవచ్చు.. నిరసన స్థలాన్ని డీనోటిఫై చేయవచ్చు.. గొంతులను కొంతకాలం అడ్డుకోవచ్చు. కానీ ప్రజల ప్రశ్నించే హక్కును అలా రద్దు చేయలేరు.

**జంతర్ మంతర్ ఒక స్థలం మాత్రమే కాదు.. ప్రజాస్వామ్యంలో పాలకుడిని ప్రశ్నించే హక్కుకు ప్రతీక. ఆ ప్రతీకను కాపాడాలి. నిరసన హక్కును గౌరవించాలి. ప్రజల గొంతుకను అణచివేయడం కాదు.. వినడమే నిజమైన పాలనకు నిదర్శనం.**

## నిత్య జీవిత కష్టాలను కప్పిపుచ్చే

# మత రాజకీయాలపై నిలదీత!

ఒక సాధారణ సగటు కుటుంబం ఉదయం లేవగానే ఆలోచించే నిత్య జీవిత సమస్యలు ఏమిటి? పిల్లల చదువులకు కట్టాల్సిన ఫీజులు ఎలా సర్దాలి? ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు ఎలా చెల్లించాలి? రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసరాల ధరలతో నెల చివరి వరకు కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలి? అసలైన నిరంతర ప్రజా సమస్యలంటే ఇవే! కానీ నేటి సమాజంలో అత్యంత విచిత్రమైన, ఆందోళనకరమైన పరిస్థితి కనిపిస్తోంది. తీవ్రమైన ఈ జీవన పోరాట ప్రశ్నలు ప్రజాక్షేత్రంలో చర్చకు రావలసిన సమయాన, మతం అనే సున్నితమైన అంశాన్ని తెరపైకి తెచ్చి ఆ అసలు సమస్యలను తెలివిగా మరుగున పడేస్తున్నారు. ఇదే ఈరోజు ప్రతి పౌరుడూ నిశితంగా, లోతుగా ఆలోచించాల్సిన కీలకమైన విషయం.మొదటగా మనం ఒక సత్యాన్ని స్పష్టంగా గ్రహించాలి. మతం లేదా వ్యక్తిగత విశ్వాసం అనేది మనిషి అంతరంగ జీవితంలో గొప్ప ఓదార్పునిస్తుంది. కష్టకాలంలో నిలబడే కొండంత ధైర్యాన్ని ఇస్తుంది, సమాజంలో నైతిక విలువలను నేర్పుతుంది. మన తెలుగు నేలపై శతాబ్దాలుగా విభిన్న మతాల వారు సోదరభావంతో కలిసి జీవించారు. దర్గాల్లో హిందువులు, దేవాలయాల ఉత్సవాల్లో ముస్లింలు, క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో అన్ని వర్గాల ప్రజలు సామరస్యంతో కనిపించే ఒక అద్భుతమైన లౌకిక సంస్కృతి మనది. ఇక్కడ అసలు సమస్య ఏ మతంతోనూ లేదా విశ్వాసంతోనూ కాదు; ఆ పవిత్రమైన విశ్వాసాన్ని ప్రజల దృష్టి మళ్లించే ఒక రాజకీయ చదరంగ సాధనంగా వాడుకోవడంతోనే తీవ్రమైన వివాదం మొదలవుతుంది.ఎన్నికల సమయం దగ్గరపడినప్పుడో, లేదా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల నుంచి నిలదీసే ప్రశ్నలు పెరిగినప్పుడో ఒక్కసారిగా మతపరమైన వివాదాలు సమాజంలో పుట్టుకొస్తాయి. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం గురించి యువత గొంతెత్తి అడగాల్సిన కీలక సమయంలో, ఎవరు ఏ దుస్తులు ధరించాలి, ఎవరు ఏ ఆహారం తినాలనే అనవసరమైన తీవ్ర చర్చలు ముందుకొస్తాయి. రైతు తన పంటకు గిట్టుబాటు ధర గురించి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన వేళ, వీధుల్లో ఊరేగింపు మార్గాల వివాదాలు రాజుకుంటాయి. టీవీ చర్చా వేదికల్లో గంటల తరబడి మతపరమైన వాదోపవాదాలు సాగుతాయి తప్ప, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత గురించి గానీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల లేమి గురించి గానీ ఎవరూ గొంతెత్తి మాట్లాడరు.ఈ పరిణామాలు యాదృచ్ఛికంగా జరుగుతున్నవి కావు. సమాజంలో మానవ భావోద్వేగాలను రెచ్చగొట్టడం చాలా సులభం, కానీ చేసిన పనికి జవాబుదారీతనం చూపడం చాలా కష్టం. ఒక ప్రాంతంలో మంచి రహదారి వేయడానికి, ఆధునిక ఆసుపత్రి కట్టడానికి, వేలాది మంది యువతకు ఉద్యోగాలు సృష్టించడానికి ఏళ్ల తరబడి నిజాయితీతో కూడిన కృషి కావాలి. కానీ ఒక మతపరమైన ఉద్వేగపూరిత నినాదంతో క్షణాల్లో అమాయక జనాన్ని ఉత్తేజపరచవచ్చు. అందుకే కొందరు రాజకీయ పెద్దలకు ఇది



అత్యంత సౌకర్యవంతమైన, అనుకూలమైన దారిగా మారింది.ఈ భావోద్వేగాల దృష్టి మళ్లింపు వల్ల అంతిమంగా సర్వస్వం నష్టపోయేది మళ్లీ ఆ అమాయక సామాన్యుడే! మతం పేరుతో వీధుల్లో గొడవపడిన ఇద్దరు పొరుగువారిలో ఎవరికీ కొత్తగా ఉద్యోగం రాదు. వారిద్దరి పిల్లలూ ఒకే విధంగా నిధులు లేక శిథిలమైన పాఠశాలల్లోనే చదువుకోవాలి. ఇద్దరూ ఒకే రకమైన భారీ ధరలకు కూరగాయలు కొనుగోలు చేయాలి. రేపు ఇంట్లో అనారోగ్యం వస్తే ఇద్దరూ ఒకే విధంగా ఖరీదైన కార్పొరేట్ వైద్యం కోసం అప్పులు చేయక తప్పదు. అంటే మనల్ని విడదీసే భావోద్వేగ విషయాల కంటే, మనందరినీ ఏకం చేసే అనునిత్య కష్టాలే సమాజంలో చాలా ఎక్కువ. కానీ ఆ చేదు నిజాన్ని ప్రజలు గుర్తించకుండా చేయడమే ఈ మాయాజాలంలోని అసలు అంతర్లీన ఉద్దేశం.మరో ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, ఈ వివాదాల వల్ల సమాజంలో క్రమంగా పెరిగిపోతున్న అపనమ్మకం. ఒకప్పుడు పండుగలను సంబరంగా కలిసి జరుపుకున్న మన వీధులు, ఇప్పుడు అనుమానాస్పద చూపులతో నిండిపోతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణ లేని తప్పుడు సమాచారం, ద్వేషపూరిత వీడియోలు ఈ విషాన్ని మరింత వేగంగా వ్యాపింపజేస్తున్నాయి. ఒక వాట్సాప్ సందేశం చాలు, ఒక పల్లెలోని దశాబ్దాల ప్రశాంతతను క్షణాల్లో చెదరగొట్టడానికి.దీనికి నిజమైన పరిష్కారం పౌరులైన మన ఆలోచనా సరళిలోనే ఉంది. ఏదైనా వివాదం తెరపైకి వచ్చినప్పుడు ఇది సరిగ్గా ఇప్పుడే ఎందుకు ముందరకొచ్చింది, దీనివల్ల అంతిమంగా ఎవరికి లాభం అని విచక్షణతో ప్రశ్నించుకోవాలి. ప్రభుత్వం నుంచి రొట్టె, విద్య, ఉపాధి, వైద్యం పొందే హక్కు ప్రతీ మనిషికీ ఉంటుంది. మతం పేరుతో ఆ హక్కులను మాయం చేసే ప్రతీ కుట్రనూ మనం గుర్తించి, సున్నితంగా కానీ అత్యంత దృఢంగా నిలదీయాలి. విశ్వాసాన్ని గౌరవిద్దాం, కానీ పౌర వివేకాన్ని మాత్రం వదులుకోవద్దు. గుడి, మసీదు, చర్చి ముందు భక్తితో ప్రార్థన చేసే చేతులే, ప్రభుత్వ కార్యాలయాల ముందు తమ ప్రాథమిక హక్కుల సాధన కోసం కూడా బలంగా పైకి లేవాలి. అప్పుడే మతం మనల్ని కలిపే మానవీయ శక్తిగా నిలుస్తుంది తప్ప, మన నిత్య జీవిత సమస్యలను కప్పిపుచ్చే కాలరహిత తెరగా మిగిలిపోదు!

**డా. సూర్యదేవర రామకృష్ణ,**
jaikisan999@gmail.com

# ఎవరు ప్రమాదంలో ఉన్నారు?

"హిందూ మతం ప్రమాదంలో ఉంది. హిందూ ప్రజలు ప్రమాదంలో ఉన్నారు" అనీ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి శ్రేణులు ప్రతిరోజూ అంటున్నారు. ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు!

ఇది పచ్చి అబద్ధం! దేశంలో అతి పెద్ద మతం, హిందూమతమే ఉండగా.. దేశంలో మూడొంతుల ప్రజలు, హిందూ మతానికి చెంది న వారే ఉండగా.. దేశంలో పరిపాలకులంతా, తొంబై తొమ్మిది శాతం హిందూ మతానికి చెందిన వారే ఉండగా.. 2014 నుండి నేటి వరకు వరుసగా, మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ గారే అధికారంలో ఉండగా.. హిందూ మతం ఎందుకు ప్రమాదంలో ఉంటుంది? హిందూ ప్రజలు ఎందుకు ప్రమాదంలో ఉంటారు? ఎవరిని ఉద్ధరించడానికి ఈ మత చాందస ˇవాదాన్ని, వీళ్ళు ప్రజల్లో నూరిపోస్తున్నారు? ఒకవైపు నిరంతరం ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతూ.. మరోవైపు సర్ పేరుతో ఈరోజు 13 కోట్లకు పైగా ప్రజల ఓట్లను తొలగించారు! అంటే మతం పేరుతో వీళ్లు ఎవరికి ద్రోహం చేస్తున్నారు? ఎవరు ప్రమాదంలో ఉన్నారు? ఆలోచించండి..ప్రమాదంలో ఉన్నది హిందువులు కాదు - హిందూ మతం కాదు! ముస్లింలు కాదు, క్రైస్తవులు కాదు! ప్రమాదంలో ఉన్నది యావత్ దేశ ప్రజలు! ప్రమాదంలో ఉన్నది భారత ప్రజాస్వామ్యం! ప్రమాదంలో ఉన్నది భారత రాజ్యాంగం!

**- ముద్దగౌని సుభాష్**

## రుక్కులు

వేర్లు లేనిదే చెట్టు నిలువదు
పునాది లేనిదే ఇల్లు నిలువదు
జ్ఞానం లేనిదే ప్రశ్న నెగ్గదు
నిలువాలి నెగ్గాలి
బుద్ధి బులెట్టవ్వాలి

వినయంతో నమస్కారాలు
కుసంస్కారంతో డింగిళ్ళు
లాభాపేక్షతో హస్తార్పణాలు
ప్రేమ బంధాలతో వెన్నెలకోల

**రేడియమ్**
**9291527757**



# పొలంలో శ్రమ.. ఇంట్లో బాధ్యత.. గ్రామీణ ప్రగతికి మహిళే చోదకశక్తి!

వ్యవసాయం అంటే కేవలం పొలంలో విత్తనం వేయడం, పంట పండించడం మాత్రమే కాదు. విత్తన ఎంపిక నుంచి నాట్లు వేయడం వరకు, కలుపు తీయడం నుంచి పంట కోత వరకు, ధాన్యం శుద్ధి నుంచి నిల్వ చేయడం వరకు, పశు పోషణ నుంచి పాల ఉత్పత్తి వరకు, ఇంటి ఆహార భద్రత నుంచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడం వరకు మహిళల పాత్ర ఎంతో విస్తృతంగా ఉంది. అయితే వ్యవసాయ రంగంలో మహిళలు నిర్వహిస్తున్న ఈ అపారమైన శ్రమలో గణనీయమైన భాగం ఇప్పటికీ "కుటుంబ సహాయక పని"గా మాత్రమే గుర్తించబడుతోంది. వాస్తవానికి భారత వ్యవసాయ వ్యవస్థను నిలబెట్టే ప్రధాన శక్తుల్లో గ్రామీణ మహిళలు ఒకరు. ఐక్యరాజ్యసమితి అక్టోబర్ 15ను అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవంగా గుర్తించడం వెనుక కూడా ఇదే వాస్తవం ఉంది. గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత లేకుండా ఆహార భద్రత, పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన వ్యవసాయం వంటి లక్ష్యాలను సాధించడం సాధ్యం కాదు.
ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యం ఎంత కీలకమో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆహార, వ్యవసాయ సంస్థ తాజా గణాంకాల ప్రకారం 2023లో ప్రపంచ వ్యవసాయ కార్మిక శక్తిలో మహిళల వాటా 39.6 శాతంగా ఉంది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం, ఆహార ఉత్పత్తి, పశుపోషణ, మత్స్యరంగం, అటవీ ఆధారిత జీవనోపాధులు తదితరాలను కలుపుకున్న వ్యవసాయ-ఆహార వ్యవస్థల్లో సుమారు 1.4 బిలియన్ మంది పనిచేస్తుండగా, పనిచేస్తున్న మహిళల్లో 43.8 శాతం, అంటే సుమారు 58.4 కోట్ల మంది మహిళలు, వ్యవసాయ-ఆహార వ్యవస్థలపై ఆధారపడి ఉన్నారు.

ప్రపంచ వ్యవసాయంలో మహిళల పాత్రను కేవలం శ్రమ పరిమాణంతోనే కొలవలేం. వారు ఆహార భద్రతకు, కుటుంబ పోషణకు, విత్తన సంరక్షణకు, జీవ వైవిధ్య పరిరక్షణకు, పశు సంపద నిర్వహణకు, నీటి వినియోగానికి, స్థానిక ఆహార సంప్రదాయాల పరిరక్షణకు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం మహిళలు ప్రపంచ ఆహార ఉత్పత్తిలో సుమారు సగానికి బాధ్యత వహిస్తున్నప్పటికీ, వ్యవసాయ భూమిపై వారి యాజమాన్యం సుమారు 15 శాతం వద్ద మాత్రమే ఉంది. అంటే వ్యవసాయ ఉత్పత్తిలో మహిళల భాగస్వామ్యానికి, ఆస్తి యాజమాన్యంలో వారి వాటాకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది.

భారతదేశ పరిస్థితిని పరిశీలిస్తే మహిళల పాత్ర మరింత స్పష్టమవుతుంది. దేశంలో గ్రామీణ మహిళల జీవనోపాధికి వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు ప్రధాన ఆధారంగా ఉన్నాయి. 2026 మార్చిలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సమాచార ప్రకారం గ్రామీణ మహిళల్లో సుమారు 80 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నిమగ్నమై ఉన్నారు. వారిలో 33 శాతం మంది వ్యవసాయ కూలీలుగా, 48 శాతం మంది స్వయం ఉపాధి రైతులుగా ఉన్నారని ప్రభుత్వం పేర్కొంది. ఈ గణాంకాలు వ్యవసాయ రంగంలో మహిళలు కేవలం కూలీలుగా కాకుండా స్వయంగా రైతులుగా కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడిస్తున్నాయి.

భారతదేశంలో మహిళల వ్యవసాయ భాగస్వామ్యంలో గత కొన్నేళ్లుగా గమనించదగిన మార్పు చోటుచేసుకుంది. 2017--18లో మహిళా కార్మికుల్లో వ్యవసాయ రంగంలో పనిచేసేవారి వాటా 57.0 శాతం ఉండగా, 2023--24 నాటికి అది 64.4 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా కార్మికుల్లో వ్యవసాయంపై ఆధారపడుతున్న వారి వాటా ఇదే కాలంలో 73.2 శాతం నుంచి 76.9 శాతానికి పెరిగింది. మరోవైపు పురుషుల్లో వ్యవసాయ రంగం వాటా 2017--18లో 40.2 శాతం ఉండగా 2023--24లో 36.3 శాతానికి తగ్గింది. ఈ మార్పు భారత వ్యవసాయంలో మహిళల పాత్ర పెరుగుతున్నదానికి ఒక ముఖ్యమైన సూచికగా పరిశోధకులు పేర్కొంటున్నారు.

ఇక్కడ ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తించాలి. వ్యవసాయంలో మహిళల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారి హక్కులు, ఆదాయం, ఆస్తి యాజమాన్యం, నిర్ణయాధికారం అదే స్థాయిలో పెరుగుతున్నాయా అనే ప్రశ్నకు సమాధానం ఇంకా సంతృప్తికరంగా లేదు. ఒక




మహిళ విత్తనం ఎంచుకోవచ్చు, పొలంలో నాట్లు వేయవచ్చు, పంట కోయవచ్చు, పశువులను చూసుకోవచ్చు, పంటను మార్కెట్‌కు సిద్ధం చేయవచ్చు. కానీ భూమి పట్టా ఆమె పేరుపై ఉండకపోవచ్చు. బ్యాంకు రుణం ఆమెకు నేరుగా అందకపోవచ్చు. వ్యవసాయ పరికరాల కొనుగోలులో ఆమెకు నిర్ణయాధికారం లేకపోవచ్చు. పంటకు వచ్చిన తుది ఆదాయంపై కూడా ఆమెకు పూర్తి నియంత్రణ లేకపోవచ్చు. అందువల్ల "వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యం"ను కేవలం పని చేసే గంటలతో కాకుండా భూమి, రుణం, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్, ఆదాయం, నిర్ణయాధికారం వంటి అంశాలతో కలిపి చూడాలి.
భారతదేశంలో మహిళా రైతుల సమస్యల్లో భూమి యాజమాన్యం అత్యంత ముఖ్యమైనది. భూమిపై చట్టపరమైన హక్కు లేకపోతే రైతు అనే గుర్తింపు పొందడం కష్టమవుతుంది. వ్యవసాయ రుణాలు, పంట బీమా, ప్రభుత్వ సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాలు, వ్యవసాయ యంత్రాలపై సహాయం వంటి అనేక ప్రయోజనాలు భూమి పత్రాలు, రైతు గుర్తింపుతో ముడిపడి ఉంటాయి. అందువల్ల భూమిని సాగు చేస్తున్న మహిళకు, భూమిపై హక్కు ఉన్న మహిళకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది.
వ్యవసాయంలో మహిళల పని చాలా సందర్భాల్లో కనిపించని శ్రమగా మిగిలిపోతోంది. ఉదయం ఇంటి పనులు పూర్తి చేసి పొలానికి వెళ్లడం, పంట పనులు చేయడం, తిరిగి వచ్చి వంట, పిల్లల సంరక్షణ, పశువుల సంరక్షణ, నీటి సేకరణ వంటి పనులు చేయడం వల్ల మహిళల మొత్తం శ్రమ గంటలు పురుషుల కంటే చాలా ఎక్కువగా ఉండే సందర్భాలు ఉన్నాయి. కానీ కుటుంబ ఆదాయ లెక్కల్లో లేదా జాతీయ ఉత్పత్తి గణాంకాల్లో ఆ గృహ శ్రమకు సరైన ఆర్థిక విలువ కేటాయించబడటం లేదు. వ్యవసాయ మహిళల సాధికారతకు ఈ "కనిపించని శ్రమ"ను గుర్తించడం కూడా కీలకమైన చర్య.

మహిళల వ్యవసాయ శ్రమలో పంటల సాగుతో పాటు పశుపోషణకు కూడా అత్యంత ప్రాధాన్యం ఉంది. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు వంటి పశుసంపద నిర్వహణలో గ్రామీణ మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. పశువులకు మేత పెట్టడం, నీరు అందించడం, పశువుల సంరక్షణ, పాల సేకరణ, పాల ఉత్పత్తుల తయారీ వంటి పనులు కుటుంబ ఆదాయానికి ప్రత్యక్షంగా తోడ్పడుతున్నాయి. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతు కుటుంబాల్లో పంట ఆదాయం మాత్రమే కాకుండా పశుపోషణ ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి ఆధారంగా ఉంటుంది.

తోటల సాగు, కూరగాయల సాగు, పూల సాగు, సేంద్రియ వ్యవసాయం, విత్తన సంరక్షణ వంటి రంగాల్లో కూడా మహిళల పాత్ర విస్తరిస్తోంది. స్థానిక విత్తనాలను సంరక్షించడం ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో గ్రామీణ మహిళల అనుభవ జ్ఞానం ఎంతో విలువైనది. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతం మార్పులు, నీటి కొరత వంటి పరిస్థితుల్లో స్థానిక పరిజ్ఞానం ఆధారంగా పంటల ఎంపిక, విత్తనాల సంరక్షణ, పంట వైవిధ్యం వంటి అంశాల్లో మహిళల అనుభవం స్థిరమైన వ్యవసాయానికి ఉపయోగపడుతుంది.

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ మహిళలకు కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. మొబైల్ ఫోన్లు, వాతావరణ సమాచార సేవలు, డిజిటల్ మార్కెట్లు, ఆన్‌లైన్ వ్యవసాయ సలహాలు, పంట ధరల సమాచారం, డిజిటల్ చెల్లింపులు వంటి సదుపాయాలు రైతుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే గ్రామీణ మహిళలకు డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్, శిక్షణ అందుబాటులో లేకపోతే ఈ అవకాశాలు వారికి పూర్తిగా ఉపయోగపడవు. అందుకే వ్యవసాయ సాంకేతికతలో లింగ సమానత్వం కూడా ఒక ముఖ్యమైన అంశంగా మారింది.
మహిళా స్వయం సహాయక సంఘాలు ఈ మార్పులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. చిన్న మొత్తాల పొదుపు నుంచి ప్రారంభమైన మహిళా సంఘాలు నేడు పశుపోషణ, ఆహార పదార్థాల తయారీ, విత్తన ఉత్పత్తి, సేంద్రియ వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తుల విలువ వృద్ధి, మార్కెటింగ్ వంటి రంగాల్లోకి విస్తరిస్తున్నాయి. ఒక మహిళ ఒంటరిగా మార్కెట్‌లోకి ప్రవేశించడానికి ఎదురయ్యే సమస్యలను సంఘంగా ఏర్పడటం ద్వారా అధిగమించే అవకాశం ఉంటుంది. సమూహ ఆధారిత వ్యవసాయ వ్యాపారాలు గ్రామీణ మహిళల ఆదాయాన్ని పెంచడమే కాకుండా వారి సామాజిక నిర్ణయాధికారాన్ని కూడా పెంచగలవు.

వ్యవసాయ ఉత్పత్తికి సరైన మార్కెట్ లభించకపోవడం మహిళా రైతుల మరో పెద్ద సమస్య. పొలంలో పంట పండించిన తర్వాత దానిని నిల్వ చేయడం, రవాణా చేయడం, ధరను నిర్ణయించడం, మధ్యవర్తులతో చర్చించడం వంటి ప్రక్రియల్లో మహిళలకు తగిన అవకాశాలు ఉండవు. మహిళల ఆధ్వర్యంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు, మహిళా మార్కెట్లు, ప్రత్యక్ష విక్రయ కేంద్రాలు పెరిగితే రైతు కుటుంబానికి లభించే ఆదాయంలో మహిళల వాటా కూడా పెరిగే అవకాశం ఉంది.

వ్యవసాయంలో మహిళల శ్రమకు సరైన పారితోషికం అందకపోవడం కూడా ఒక సమస్య. ఐక్యరాజ్యసమితి పేర్కొన్న తాజా ఆహార, వ్యవసాయ సంస్థ గణాంకాల ప్రకారం వ్యవసాయంలో వేతన ఉద్యోగాలు చేస్తున్న మహిళలు పురుషులు సంపాదించే ప్రతి ఒక డాలర్‌కు సగటున 82 సెంట్లు మాత్రమే సంపాదిస్తున్నారు. అంటే వేతన అసమానత ఇప్పటికీ కొనసాగుతోంది.

మహిళలకు సమానంగా ఉత్పాదక వనరులు అందితే వ్యవసాయ ఉత్పాదకత కూడా పెరుగుతుందని అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రకారం మహిళలకు పురుషులతో సమానంగా ఉత్పాదక వనరులు లభిస్తే వ్యవసాయ దిగుబడులు 20 నుంచి 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల అదనంగా 10 కోట్ల నుంచి 15 కోట్ల మంది ప్రజలకు ఆహారం అందించే సామర్థ్యం ఏర్పడవచ్చని అంచనా. భవిష్యత్తులో మహిళలను వ్యవసాయంలో కేవలం కార్మికులుగా కాకుండా నిర్ణయాధికారులు, ఉత్పత్తిదారులు, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి. మహిళల సాధికారతతోనే కుటుంబం, గ్రామం, వ్యవసాయ రంగం, చివరకు దేశం అభివృద్ధి చెందుతుంది. అందువల్ల మహిళా రైతుల శ్రమకు గౌరవం, సమాన అవకాశాలు, సామాజిక భద్రత కల్పించడం సమాజం మొత్తం బాధ్యత. మహిళల భాగస్వామ్యం బలపడినప్పుడే సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత, గ్రామీణాభివృద్ధి లక్ష్యాలు సాకారమవుతాయి.

**- డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- పదేండ్ల సమస్యకు పరిష్కారం
- 310 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు
- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 15 (జనం సాక్షి) :** పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు ప్రభుత్వ విప్ లియెన్నం శ్రీనివాస్ రెడ్డిలి మహబూబ్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్‌పల్లి, ఆదర్శ్‌నగర్ ప్రాంతాలకు చెందిన 310 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు , అన్నపూర్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతోలి కలిసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 523 సర్వే నంబర్ పరిధిలో అనేక చిక్కుముడులు ఉన్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించి 310 కుటుంబాలకు ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు కల్పించడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించినప్పటికీ, సరైన గుర్తింపు పత్రాలు, చట్టబద్ధమైన ధ్రువపత్రాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. ఇళ్లను వారసులకు బదిలీ చేసే విషయంలోనూ సమస్యలు తలెత్తాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు చిక్కుముడులు రాకుండా అన్ని అంశాలను పరిశీలించి, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాతే పట్టాలు పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ పట్టాలు కేవలం కాగితాలు కావని, కుటుంబాలకు భద్రత కల్పించే చట్టబద్ధమైన హక్కులని అన్నారు. రాబోయే తరాలు కూడా తమ ఇంటిపై గర్వంగా హక్కు ప్రకటించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.70 కోట్లు మంజూరు చేయించామని, మొదటి దశలో రూ.20 కోట్లతో పనులు ప్రారంభించామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాల పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తున్నామని, సుమారు 2,000 మంది విద్యార్థులు నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునేలా ఆ విద్యాసంస్థను తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. గర్ల్స్ జూనియర్ కళాశాల కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నడిగడ్డలోని ఒకేషనల్ కళాశాల అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించి ఆధునిక సదుపాయాలు కల్పించామని, పక్కనే ఉన్న జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మరో రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక విద్య అందించేందుకు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 10 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో రెండింటిని మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చామని సుమారు రూ.68 కోట్లతో ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసి, టాటా గ్రూప్ సహకారంతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. మహబూబ్‌నగర్ నగర అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి, విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ క్రిస్టియన్‌పల్లిలో గత తొమ్మిది, పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యను పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, 10వ డివిజన్ కార్పొరేటర్ రమేష్, తో పాటు ఇతర కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లు తొలగించరాదు



**హయత్‌నగర్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ)డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా, తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతున్నారన్న ఆందోళనల నేపథ్యంలో, ముఖ్యంగా మహిళలు ఓటు హక్కుకు దూరమయ్యే ప్రమాదం ఉందని సంఘం పేర్కొంది. మరణించినవారు, చిరునామా మారినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరు నమోదును కలిగి ఉన్నవారి విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అర్హులైన ఇతర ఓటర్ల పేర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించరాదని కోరింది. ఈ మేరకు సంబంధిత ఎన్నికల అధికారులకు, జిల్లా కలెక్టర్లకు సంఘం ప్రతినిధులు మెమోరాండాలు సమర్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రభుత్వాలు, ఎన్నికల సంఘం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనసూయతో పాటు సంధ్య, ప్రేమలత, భారతి, రేణుక, అనురాధ, మానస, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**ధారూర్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ప్రతి కార్మికుడు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి ఏ.రాధిక అన్నారు. అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ధారూర్ మండలం నాగసముందర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవడంతోపాటు, తమ హక్కులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో చట్టాలు నిర్దేశించిన పని గంటలు, వేతనాలు,ఇతర హక్కుల గురించి తెలుసుకోవాలని రాధిక సూచించారు.పని చేయించుకున్నందుకు తగిన వేతనం చెల్లించడం యజమాని బాధ్యత అని తెలిపారు. కార్మికులను ఇష్టానుసారంగా పనిలోకి తీసుకోవడం, తిరిగి విధుల నుంచి తొలగించడం వంటి అంశాల్లోనూ వర్తించే కార్మిక చట్టాలు, నిబంధనలను పాటించాల్సి ఉంటుందని తెలిపారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉంటే అన్యాయానికి గురికాకుండా న్యాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా లేబర్ కార్డులు పొందాలని, వాటి ద్వారా ప్రభుత్వం కల్పించే వివిధ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సదస్సు ఏర్పాటు చేసిన అంకిత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను అభినందించారు. అనంతరం గ్రామంలోని భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాగసముందర్ సర్పంచ్ వెంకటేశ్వర్,డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాము,అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా సమన్వయకర్త ప్రకాష్ కుమార్, గ్రామ పాలన అధికారి సమీర్ సంస్థ క్షేత్రస్థాయి అధికారి శ్రీనివాస్, క్షేత్రస్థాయి సమన్వయకర్త సంజీవరావు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తు ఎల్‌నినోను ఎదుర్కొందాం

**వికారాబాద్ బ్యూరో, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** భారత్‌తో పాటు ప్రపంచ దేశాలను వణికిస్తున్న ప్రకృతి విపత్తు ఎల్‌నినోను ప్రజలందరం కలిసి ఎదుర్కొవాలని తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసన సభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. వికారాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రోజు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్ నినో విపత్తు, దాని ప్రభావంపై స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం దాదాపు 100 దేశాల్లో ఉందని, ఇదోక ప్రకృతి విపత్తు అని చెప్పారు. ప్రజలు, రైతులు ప్రజా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకెళ్లాలని కోరారు. రైతులకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సాగుకు నీటిని పొదుపుగా వినియోగించుకుందామన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ప్రకృతి విపత్తును కలిసికట్టుగా నిలబడి ఎదుర్కోవాలని తెలిపారు.పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రజా ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. నిరుపేదల ఆడబిడ్డల పెళ్లిలకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రజా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది అని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. మొత్తం 97 మంది లబ్ధిదారులకు (97 లక్షల 11 వేల 252 రూపాయలు) స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య చెక్కులను అందించారు. ఇందులో 58 మంది కళ్యాణ్ లక్ష్మీ లబ్ధిదారులు, 39 మంది షాదీ ముబారక్ లబ్ధిదారులు ఉన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా ప్రజా ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు, అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో వికారాబాద్ పట్టణం చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య అన్నారు. అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తికావొస్తున్నాయని, త్వరలోనే అన్ని నిర్మాణ పనులు కూడా పూర్తవుతాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అర్థ సుధాకర్ రెడ్డి గారు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు చర్యలు



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు నేపథ్యంలో నీరు, విద్యుత్ పొదుపునకు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ ఎండీ జితేష్ పాటిల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రతి కుటుంబం నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించాలని, ఏసీలను 25 డిగ్రీల వద్ద ఉంచాలని, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సమావేశంలో భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త శ్రావణి, భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు హరీష్, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ కె. నారాయణ, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, ముఖ్య ప్రణాళిక అధికారి డాక్టర్ సురేందర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ శ్రీను

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** జిల్లాలో రోడ్డు ప్రమా దాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, రహదారులపై ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం, అత్యవసర వైద్య సేవల మెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులు సమ న్వయంతో చర్యలు చేప ట్టాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ పరిధిలోని రహదారులపై విస్తరించిన చెట్ల కొమ్మలను తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. రహదారులపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకుసూచించారు.ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణను పటిష్టం చేయడంతో పాటు, నో-పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదలను నియంత్రించాలన్నారు. బస్టాండ్‌లు, బస్‌స్టాప్‌లు లేని ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని మెడికల్ కాలేజీ ప్రవేశ మార్గాల్లో చెట్ల కొమ్మలు, ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని, అంబులెన్సుల రాకపో కలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులపై ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో నో-హార్న్ జోన్‌లు, నో-స్మోకింగ్ జోన్‌లు తదితర భద్రతా నిబంధన లపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని సంబంధిత శాఖలకు సూచించారు.రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్య సహాయం అందేలా అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచాలని,ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్సా సదుపాయాలను సమీక్షించాలని సూచించా రు. పీఎం రాహత్ పథకా నికి సంబంధించిన మార్గద ర్శకాలపై సంబంధిత అధికారులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, ప్రమాద బాధితులకు అందించే చికిత్స, అంబులెన్స్ సేవల లభ్యతపై సంబంధిత వైద్యాధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.రోడ్డు భద్రతకు సంబంధించి న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, రోడ్లుభవనాల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయా లని తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా అన్ని శాఖలు బాధ్యతా యుతంగావ్యవహరించాలని సూచించారు. కాగా సమావేశ ప్రారంభంలో ఆర్ అండ్ బీ ఈఈ వెంకట రమణయ్య గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ అండ్ బీ, ఆర్టీవో, పోలీసు, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ పై పవర్ పాయింట్ ప్రజంటే షన్ ద్వారా చూపించారు. ఆయా బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణ కు అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్ కుమార్, జిల్లా ఆస్పత్రుల సమన్వ యకర్త డాక్టర్ మల్లికార్జు న్,ఆర్టీవో మున్నీ, పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆర్టీసీ డిపో మేనేజర్ యాకన్న, ఆర్ అండ్ బీ ఏ.ఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

**ముషీరాబాద్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సరికొత్త రికార్డు సృష్టించింది. అక్టోబర్ 15న ఉదయం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 20,003 మెగావాట్లకు చేరినట్లు తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం నమోదైన 18,548 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్‌తో పోలిస్తే 1,455 మెగావాట్లు పెరిగింది. అదే రోజు రాష్ట్ర విద్యుత్ వినియోగం 334.54 మిలియన్ యూనిట్లకు చేరింది. అక్టోబర్ 1 నుంచి 15 వరకు సగటు గరిష్ఠ డిమాండ్ 19,289 మెగావాట్లుగా, రోజువారీ సగటు వినియోగం 321.34 మిలియన్ యూనిట్లుగా నమోదైంది.

### టీజీఎస్పీడీసీఎల్, జిహెచ్ఎంసి పరిధిలోనూ పెరుగుదల

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో అక్టోబర్ 15న గరిష్ఠ డిమాండ్ 12,281 మెగావాట్లకు, రోజువారీ వినియోగం 228.14 మిలియన్ యూనిట్లకు చేరింది. గతేడాది గరిష్ఠ రోజువారీ వినియోగం 222.34 మిలియన్ యూనిట్లతో పోలిస్తే 5.80 మిలియన్ యూనిట్లు పెరిగింది. సెప్టెంబర్ 30న ఈ పరిధిలో గరిష్ఠ డిమాండ్ 12,299 మెగావాట్లుగా నమోదైంది. హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలో అక్టోబర్ 15న సాయంత్రం 6:19 గంటలకు 4,220 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదవగా, అక్టోబర్ 9న రోజువారీ వినియోగం 88.22 మిలియన్ యూనిట్లకు చేరింది. గతేడాది అక్టోబర్‌లో నమోదైన 3,552 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్‌తో పోలిస్తే ఈసారి గణనీయంగా పెరిగింది. గృహ, వ్యవసాయ, వాణిజ్య, ఐటీ, పారిశ్రామిక అవసరాలతో పాటు అధిక ఉష్ణోగ్రతలు, శీతలీకరణ పరికరాల వినియోగం పెరగడం డిమాండ్ పెరుగుదలకు కారణమవుతున్నాయి.



### విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలి

పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరాను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ తెలిపారు. విద్యుత్ కొనుగోలు, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు తదితర చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భూగర్భ జలమట్టాలు తగ్గడంతో బోర్లు, మోటార్ల వినియోగం పెరిగి విద్యుత్ డిమాండ్‌పై ఒత్తిడి పెరుగుతోందన్నారు. అవసరం లేనప్పుడు విద్యుత్ పరికరాలను ఆపివేసి, విద్యుత్‌తో పాటు నీటిని కూడా పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### 'పొలం బాట'తో రైతులకు విద్యుత్ శాఖ అండ

సీఎండీ ఆదేశాల మేరకు గత వారం రోజులుగా అధికారులు 'పొలం బాట' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. విద్యుత్ సరఫరా, భూగర్భ జలమట్టాలు, బోర్లలో నీటి లభ్యత, మోటార్లు, సర్వీస్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, తక్కువ వోల్టేజీ సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. సాగునీటి అవసరాల సమయంలో అంతరాయాలు లేకుండా సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ, రైతుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులకు ఆదేశించారు. రికార్డు స్థాయి విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించడంలో ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషి, నిరంతర పర్యవేక్షణ కీలకమని సీఎండీ అభినందించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.

## దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అరికట్టాలి



**శామీర్‌పేట, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా చేపడుతున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శామీర్ పేట డివిజన్ కీసర సర్కిల్ పరిధిలోని, దేవాలయంజాల్ గ్రామంలో ప్రభుత్వ దేవాలయ భూమిలో మున్సిపాలిటీ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా చేపడుతున్నారంటూ స్థానిక రామాలయ మాజీ చైర్మన్ పెండం లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్ర వారం ఈ విషయమై కీసర ఆర్డీవో వెంకట్ రెడ్డి, కీసర సర్కిల్ డిసి రామలింగం, షామీర్ పేట తహశీల్దార్ శ్రీనివాసులకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. దేవాలయ గ్రామ పరిధిలోని దేవాలయ భూమి సర్వే నంబర్ 63లో అక్రమంగా కన్వెన్షన్ హాల్, గోదాము, రెండు విల్లాలు నిర్మాణాలు చేపట్టారని ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ నుండి గాని, ఇతర ప్రభుత్వ నుండి గాని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఆక్రమంగా అతి పెద్ద భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులు విచారణ జరిపి వాటిని తొలగించాలని ఆయన కోరారు. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి ఈ యొక్క దేవాలయ భూమిని కాపాడాలని కోరారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
17 అక్టోబర్ 2026

# తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం కీలకం
- రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్

**గుమ్మడిదల, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి భూగర్భ జలమట్టాలు పడిపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి వృథాను అరికట్టి అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

### రైతులకు అవగాహన కల్పించాలి

శుక్రవారం గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీతతో కలిసి వాణి ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో సాగవుతున్న పత్తి, కంది, టమాట పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తి రైతు బాల్‌రెడ్డిని పంటల పరిస్థితి, సాగునీటి లభ్యత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి రైతు తన పొలంలో ఫామ్ పాండ్స్ నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు.

వీబీ–జీ రామ్‌జీ పథకం కింద లభించే పనిదినాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని, అవసరమైన చోట పంట విరామాన్ని పాటించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

### నీటి లభ్యత ఆధారంగానే పంటల ఎంపిక

అనంతరం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల సంబంధిత శాఖల అధికారులతో వాణి ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పంటల పరిస్థితి, వర్షపాతం, తాగునీటి వనరులు, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం లభ్యత, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు.

ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలు చేతికొచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న యాసంగి సీజన్‌లో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిని అంచనా వేసిన తర్వాతే రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నీటి లభ్యతను పరిశీలించకుండా వరి సాగు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని స్పష్టం చేశారు.

వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలవారీగా పంటల పరిస్థితిని పరిశీలించి, పంటల రక్షణకు అవసరమైన సలహాలు అందించాలని తెలిపారు. జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలమట్టాలు, బోర్లలో నీటి లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

### నీటి వృథాను అరికట్టాలి

గ్రామాలవారీగా తాగునీటి అవసరాలను గుర్తించి, నీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని వాణి ప్రసాద్ ఆదేశించారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖల



అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వాటర్ రిసోర్సెస్ కమిటీల ద్వారా నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో నీటి సంరక్షణకు సంబంధించిన తీర్మానాలు చేయించాలని సూచించారు.

రాబోయే 10 నుంచి 15 రోజులు పంటల రక్షణకు కీలకమని పేర్కొంటూ, అవసరమైన ప్రాంతాల్లో పంటలకు తగిన విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సంబంధిత శాఖల అధికారులు ప్రతి వారం సంయుక్త సమీక్ష సమావేశం నిర్వహించాలని తెలిపారు.

### పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యలు

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పశుగ్రాస కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు వాణి ప్రసాద్ సూచించారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా పశుగ్రాసాన్ని నిల్వ చేసుకునేలా అవగాహన కల్పించాలని, పశుగ్రాసం వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో పాటు ప్రజలు, రైతుల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల అదనపు కలెక్టర్లు సంగీత, లక్ష్మి కిరణ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి, గుమ్మడిదల తహసీల్దార్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వమే భవిష్యత్తులో మళ్లీ వస్తుంది

- మాజీ మంత్రి హరీష్ రావు



**మక్తల్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్ మండలానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులు సీనియర్ తెలంగాణ ఉద్యమ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో భాగంగా తెలంగాణ ఉద్యమ పోరాట ఘట్టాలను, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు ఉద్యమకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా అయితే అంకితభావంతో చురుగ్గా పాల్గొన్నారో, అదే విధంగా రాబోయే రోజుల్లో పార్టీ అధినేత కేసీఆర్ పిలుపుమేరకు పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క ఉద్యమకారుడు సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నేతృత్వంలో ఉద్యమంలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క నిజమైన ఉద్యమకారుడికి తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన భరోసా నిచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ తెలంగాణ ఉద్యమకారులు, మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ దేవరి మల్లప్ప మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పుడు పిలుపునిచ్చినా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసేందుకు మక్తల్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారులు సర్వసద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్‌లో వైభవంగా తెలంగాణ జాగృతి బతుకమ్మ సంబరాలు



**మెదక్ టౌన్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మెదక్ పట్టణంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో సందడి చేశారు. సంప్రదాయ ఆటపాటలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రజిత, ఉమ్మడి మెదక్ జిల్లా మహిళా కన్వీనర్ రాజేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మహిళలతో కలిసి బతుకమ్మ ఆటపాటల్లో పాల్గొని ఉత్సాహాన్ని నింపారు. మహిళలు సంప్రదాయబద్ధంగా తీర్చిదిద్దిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఉత్తమంగా అలంకరించిన బతుకమ్మలను ఎంపిక చేసి ఐదుగురు మహిళలకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మహిళల సాంస్కృతిక ప్రతిభను అభినందిస్తూ, తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి బట్టి అజయ్, పార్టీ సీనియర్ నాయకుడు ఇప్ప రమేష్, విద్యార్థి విభాగం నాయకుడు ఎండీ జునైద్ పాల్గొన్నారు. అలాగే కరాటే ప్రేమ్, గుట్టకిందిపల్లి రాజశేఖర్, చౌదరి భాను, చౌదరి నవీన్, అల్తాఫ్, అయ్యాన్, జంగం నాగరాజు, వేపూరి శ్రీనివాస్, కంచి విజయ్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# నవాబ్‌పేటలో 'ప్రీమియర్ లీగ్' క్రీడా సంబరం..

- ఘనంగా ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతతో ప్రతిజ్ఞ
- హాజరైన టీపీసీసీ కోఆర్డినేటర్ దారా భాస్కర్, సర్పంచ్ గీతారాణి, ప్రముఖులు

**నవాబ్‌పేట, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** నవాబ్‌పేట పట్టణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ, ఐక్యత, స్నేహభావాలను చాటిచెప్పే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నవాబ్‌పేట్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. స్థానిక మైదానంలో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మొదటి బహుమతి ప్రదాత, టీపీసీసీ కోఆర్డినేటర్ దారా భాస్కర్, నవాబ్‌పేట పట్టణ సర్పంచ్ గీతారాణి, డిప్యూటీ సర్పంచ్ అజార్ అలీ, పోమాల్ గ్రామ మాజీ సర్పంచ్ కొండనోళ్ల కృష్ణయ్య, దాయపంతులపల్లి సర్పంచ్ కమలమ్మ కుమార్, వార్డు సభ్యులు శివకుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు బీఆర్ఎస్ నవాబ్‌పేట మండల యూత్ అధ్యక్షులు, వార్డు సభ్యులు మెండే శ్రీను, పోమాల్ గ్రామ బీఆర్ఎస్



అధ్యక్షులు గుట్టమీది నర్సిములు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### సామాజిక బాధ్యతపై యువత ప్రతిజ్ఞ

క్రీడల ప్రారంభానికి ముందు యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. యువత అంతా మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని అతిథుల సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ప్రమాణం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడలను కేవలం ఆటలకే పరిమితం చేయకుండా, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. యువత అంతా ఐక్యతతో ముందుకు సాగాలని, ఈ ప్రీమియర్ లీగ్‌లో ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో, స్నేహభావంతో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అనంతరం టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు, క్రీడాకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు.. ముఖ్య అతిథులు దారా భాస్కర్, సర్పంచ్ గీతారాణితో పాటు ఇతర ప్రముఖులను శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవాబ్‌పేట మండల పాత్రికేయులు చిన్నయ్య, వీరేశ్, కుమార్, కృష్ణ, నర్సింములు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

**కోహెడ, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ లో సిద్దిపేట జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను ఘనంగా ప్రారంభించారు. పోటీల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గవ్వ వంశీధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బందెల సుజాత, ప్రజాప్రతినిధులతో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గవ్వ వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ని కోహెడలో నిర్వహించడం సంతోషంగా ఉందని, ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి హాజరైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్, జూదం ,ఆన్లైన్ గేమ్స్‌కి బానిస కాకూడదని ఇలాంటి క్రీడా పోటీలలో పాల్గొని శరీర దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని క్రీడ లలో గెలుపోటములు సహజమని గెలుపొందిన వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. గత 12 సంవత్సరాలుగా గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ఈ పోటీలలో గెలుపొందిన మొదటి జట్టు (విన్నర్) 10 వేల నగదు తో పాటు ట్రోఫీని, రెండవ జట్టు (రన్నర్) 5 వేల నగదు తో పాటు ట్రోఫీని అందజేస్తామని తెలిపారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బెస్ట్ ప్లేయర్ అవార్డు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ



జడ్పిటిసి పొన్నాల లక్ష్మణ్, కోహెడ ఉపసర్పంచ్ కందాల వెంకటేష్, సంకల్ప స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీటీసీ తిప్పారపు నాగరాజు, డాక్టర్ దయాకర్ ,వార్డు సభ్యులు గుగ్గిళ్ళ శ్రీనివాస్,కందాల రవీందర్,గజ్జెల ప్రవీణ్ ,సదానందం ,ఆర్గనైజర్స్ రఘు యాదవ్, అవినాష్, వంశీ, అంజి, మనీ ,గవ్వ వంశీధర్ రెడ్డి యువసేన సభ్యులు పూసాల రాజశేఖర్,రామంచ అరుణ్ రెడ్డి, కలికోట రాహుల్ చారి, శెట్టి శ్రీనివాస్,వట్టిపెల్లి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** 2026–27 పత్తి మార్కెటింగ్ సీజన్‌లో రైతులు నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేసి, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందేలా తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.పత్తి సాగు, కోత, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే ఆశించిన మద్దతు ధర లభిస్తుందని అన్నారు.రైతులు తమ పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చే ముందు తేమ శాతం, పొడవు, మైక్రోనైర్ విలువ వంటి ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.పత్తిలో తేమ గరిష్ఠంగా 8 శాతం మాత్రమే ఉండేలా బాగా ఆరబెట్టాలని, పత్తిలో ఆకులు, చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలు కలవకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.?పత్తి నాణ్యత ఆధారంగానే కొనుగోలు ధర నిర్ణయించబడుతుందని, రైతులు వ్యవసాయ శాఖ అధికారులు మరియు కొనుగోలు కేంద్రాల సిబ్బంది సూచనలను అనుసరించాలని పేర్కొన్నారు.పత్తిని బాగా ఆరబెట్టి, శుభ్రం చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. విక్రయ సమయానికి ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా పుస్తకం, పహాణీ లేదా పట్టాదార్ పాస్ పుస్తకం వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత కోసం అధికారుల సూచనల ప్రకారం నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, కేంద్రాల్లో జరిగే నాణ్యతా పరీక్షలు, తూకం, చెల్లింపుల ప్రక్రియల్లో ప్రభుత్వ



నిబంధనలకు సహకరించాలని కోరారు.?పత్తి విక్రయాల్లో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు విధానాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను గానీ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను గానీ సంప్రదించాలని కోరారు. రైతుల సంక్షేమం, నాణ్యమైన పత్తి ఉత్పత్తి, సరైన ధర కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ బి.హరిసింగ్,ఆర్డీవోలు వేణుమాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఆర్టీవో పురుషోత్తం రెడ్డి, డిఎంఓ దామోదర్, హార్టికల్చర్ ఆఫీసర్ నాగయ్య డీఎస్పీలు, కార్యదర్శులు, మిల్లర్లు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దొమ్మాట శ్రీకాంత్ గౌడ్‌కు విజయదశమి జాతీయ పురస్కారం



**చిలప్‌చెడ్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** మండల పరిధిలోని జగ్గంపేట గ్రామానికి చెందిన నవభారతి పాఠశాల వ్యవస్థాపకులు, మిత్ర రత్నావళి, సాహిత్య రత్న, కాళోజి తెలుగు భాషా వైభవ జాతీయ పురస్కార గ్రహీత దొమ్మాట శ్రీకాంత్ గౌడ్‌కు మరో గౌరవం దక్కింది. ఉపాధ్యాయ, సాహితీ సేవా రంగాల్లో ఆయన చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో విజయదశమి జాతీయ పురస్కారాన్ని అందజేశారు. శ్రీ గౌతమేశ్వర సాహితీ గౌతమి కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి, స్వర్ణ కంకణాన్ని అందజేసి ఘనంగా గౌరవించారు. విద్యా, సాహిత్య రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమేశ్వర కళా సేవా సంస్థ వ్యవస్థాపకులు దూడపాటి శ్రీధర్‌తో పాటు కవులు తూము నర్సయ్య, దేవీప్రియ, వరలక్ష్మి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో పంచాయతీ కార్మికుడు మృతి

- విధి నిర్వహణలో ఎల్‌టీ లైన్ తెగిపడి సౌట బాలయ్య దుర్మరణం
- మృతుడి కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: మాజీ సర్పంచ్ బోడ్కా నాయక్

**అచ్చంపేట, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామపంచాయతీలో గత ఎనిమిదేళ్లుగా మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న సౌట బాలయ్య (45) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. విధి నిర్వహణలో ఉండగా ఎల్‌టీ విద్యుత్ లైన్ తెగిపడి అతడిపై పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### విద్యుత్ వైరు తెగిపడటంతో ప్రమాదం

గురువారం మధ్యాహ్నం గ్రామంలోని మసీదు సమీపంలో బాలయ్య గ్రామపంచాయతీ పనులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో మసీదు పక్కనే ఉన్న చెట్టుపై కోతులు గంతులు వేస్తూ ఒకదానితో మరొకటి కొట్లాడుకున్నాయి. ఈ క్రమంలో కోతులు విద్యుత్ లైన్‌పై పడటంతో వైరు తెగి బాలయ్య చేతిపై పడినట్లు సమాచారం. విద్యుత్ సరఫరా కొనసాగుతుండటంతో తీవ్ర షాక్‌కు గురైన బాలయ్య అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచ్

బాలయ్య మృతి విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ సర్పంచ్ బోడ్కా నాయక్ ఆధ్వర్యంలో నాయకులు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య, పిల్లలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బోడ్కా నాయక్ మాట్లాడుతూ.. బాలయ్య ఎనిమిదేళ్లుగా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా, వాటర్‌మ్యాన్‌గా నిజాయితీగా విధులు నిర్వహించాడని తెలిపారు. విధి నిర్వహణలో ఉండగానే ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. విద్యుత్ లైన్లకు చెట్ల కొమ్మలు తగులుతున్న విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ ప్రమాదానికి విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణమని ఆయన విమర్శించారు.

### ప్రభుత్వానికి నాయకుల డిమాండ్లు

మృతుడు సౌట బాలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బోడ్కా నాయక్‌తో పాటు టీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మృతుడి భార్యకు



గ్రామపంచాయతీలో కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని కోరారు. బాలయ్య పిల్లల చదువుల బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బొమ్మనపల్లి గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను సరిచేసి, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, టీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పంటలు చేతికొచ్చే వరకు మోటార్ల తొలగింపు

# నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- పెట్టుబడులు నష్టపోతామంటూ అన్నదాతల ఆవేదన
- సుద్దవాగు బ్యాక్‌వాటర్ నీటిపై మూడు గ్రామాల రైతుల నిరసన
- ప్రధాన రహదారిపై బైఠాయించిన బాధితులు



**కుభీర్, అక్టోబర్ 16, (జనంసాక్షి):** గడ్డెన్న సుద్దవాగు ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ద్వారా సాగునీటిని వినియోగించుకుంటున్న రైతులకు నీటి సరఫరాలో ఆటంకాలు కల్పించవద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్, భైంసా మండలాల పరిధిలోని మాలేగాం, కుంభి, లింగి గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మాలేగాం సమీపంలోని మొండి బసవన్న వద్ద సర్పంచ్ శేల్కె లక్ష్మీ ఆనంద్, మాజీ సర్పంచ్ రేఖ శంకర్ ఆధ్వర్యంలో రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, రైతులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి, అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలకు ప్రస్తుతం ఈ దశలో నీరు అత్యంత అవసరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పసుపు, శనగ, పొద్దుతిరుగుడు పంటలు ప్రస్తుతం చేతికొచ్చే దశలో ఉన్నాయని.. ఇప్పుడు గనుక నీరు అందకపోతే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామని వాపోయారు. మోటార్లను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయం తమ పొట్ట కొట్టడమేనని ఆవేదన చెందారు. పంటలు పూర్తిగా చేతికొచ్చే వరకు బ్యాక్‌వాటర్ నీటి వినియోగానికి ఎలాంటి ఆటంకాలు కల్పించవద్దని, మోటార్ల తొలగింపు నిర్ణయాన్ని పునరాలోచించి తమ జీవనోపాధిని కాపాడాలని రైతులు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# కోలలు పట్టి.. కోలాటమాడి..

- బతుకమ్మలో ఎమ్మెల్యే హంగామా!
- డీజే పాటలకు మహిళలతో కలిసి స్టెప్పులు..
- ఐడీఓసీలో పండుగ సందడి..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి.. డీజే పాటలు హోరెత్తాయి.. మహిళల కోలాటాలు ఉత్సాహాన్ని నింపాయి.. ఇదే సందడిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోలలు పట్టుకుని మహిళలతో కలిసి స్టెప్పులేస్తూ హంగామా చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే ఉత్సాహంగా పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. మహిళలతో కలిసిపోయి కోలాటం ఆడుతూ, డీజే పాటలకు లయబద్ధంగా అడుగులు వేస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎమ్మెల్యే స్వయంగా కోలలు పట్టుకుని మహిళలతో కలిసి నృత్యం చేయడంతో వేడుకల ప్రాంగణంలో సందడి మరింత పెరిగింది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సంబురాలు చేసుకున్నారు. డీజే పాటల హోరు, మహిళల ఆటపాటలు, ఎమ్మెల్యే ఉత్సాహ భరితమైన స్టెప్పులతో ఐడీఓసీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, డీపీఆర్ఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మహిళలు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించాలి

- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ నితికా పంత్



**ఆసిఫాబాద్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం లో శుక్రవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపిఎస్, జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ... ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేయరాదని, పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 112 కాల్స్ కి త్వరతగతిన స్పందించాలని అన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకొని,వారి పురోగతి కి కృషి చేయాలన్నారు. కేసుల నమోదు,దర్యాప్తు, నేరస్థుల వివరాల నిర్వహణ, డేటా సమన్వయంలో సీసీటీఎన్ఎస్ ను సమర్థవంతంగా వినియోగించి పనితీరును మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, కాగజ్ నగర్ డిఎస్పి వాహీదుద్దీన్,ఇన్స్పెక్టర్స్, సబ్ ఇన్స్పెక్టర్స్,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి ఇలాకాలో దసలి రైతులు ఆగం



- అనేకసార్లు మంత్రి గారికి మొరపెట్టుకున్న ఆదివాసులపై ఆగని దాడులు
- అటవీ అధికారుల దాడిలో దసలి రైతులకు సుమారు 9లక్షల రూపాయల నష్టం

**చెన్నూర్ అక్టోబర్ 15 (జనంసాక్షి) :** మంత్రి ఇలాకాలో హత్తు పరిశ్రమ రైతులు ఆగం అవుతున్నారని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటపల్లి మండలం కావర్ కొత్తపల్లి కి చెందిన 120 మంది ఆదివాసీలు మూడు తరాల కాలం నుండి పట్టు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారనీ అన్నారు. ఈ రోజు అటవీశాఖ అధికారులు పట్టు పురుగులను పెంచుకుంటున్న ఆదివాసులపై దౌర్జన్యాలకు పాల్పడుతూ వారిపై దాడి చేస్తూ పంటలను ధ్వంసం చేశారనీ ఇప్పటి వరకు సుమారు దసలి రైతులకు 8.5 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు, ఇంత జరుగుతా ఉన్నా మంత్రిగారు ఎందుకు స్పందించడం లేదన్నారు ఎన్నికలలో ఆదివాసీల ఓట్లు వేయించుకున్న మీరు ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు, మీరు మాట్లాడితే అటవీ అధికారులు ఎందుకు ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. మీ మాట అంటే అధికారులు ఎందుకు వినడం లేదు అని అన్నారు. ఒక ప్రభుత్వ శాఖ పైన మరొక ప్రభుత్వ శాఖ ఇలాంటి దమనకాండలు చేస్తుంటే ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎందుకు పట్టడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరితే బాపు, మహేష్, లక్ష్మయ్య, సారయ్య, దసరా రైతులు పాల్గొన్నారు.

# ఎర్రబారిన చేలు.. విలవిల్లాడుతున్న పత్తి రైతు!

- చేతికందే దశలో పంటకు తెగులు కాటు.. దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఎకరాకు రూ.30--40 వేల పెట్టుబడి.. అప్పుల ఊబిలో అన్నదాతలు
- క్షేత్రస్థాయిలో కనిపించని వ్యవసాయ శాఖ అధికారులు
- పంటలను పరిశీలించి.. రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి



**చిట్యాల, అక్టోబర్ 16 (జనంసాక్షి):** కష్టించి సాగు చేసిన పత్తి పంట చేతికందే సమయంలో ఎర్ర తెగులు రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. పచ్చగా కళకళలాడాల్సిన చేలు ఎర్రబారి, ఆకులు రాలిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల కోసం ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు ఇప్పుడు తెగులు రూపంలో మరో గండం ఎదురైంది. అప్పులు తెచ్చి సాగు చేసిన పంట దిగుబడి తగ్గిపోతే పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిట్యాల పరిసర ప్రాంతాల్లో పత్తి పంటకు తెగులు సోకుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

#### నెత్తిన పిడుగులా తెగులు దాడి!

పత్తి పంట ఎదుగుదల, పూత, కాయలు ఏర్పడే కీలక దశలో ఆకులు ఎర్రబారి రాలిపోతుండటం రైతులను కలవరపెడుతోంది. ఆకుల అంచుల నుంచి ఎర్రదనం ప్రారంభమై, క్రమంగా ఆకులు ముడతలు పడి ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. మొక్కల ఎదుగుదల మందగించడంతో పాటు పూత, పిందె నిలవకపోవడం, కాయలు సరిగా అభివృద్ధి చెందకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయని వాపోతున్నారు. వాతావరణ మార్పులు, నేలలో పోషకాల లోపం తదితర కారణాలు పంటపై ప్రభావం చూపుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తెగులుకు అసలు కారణాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత వ్యవసాయ నిపుణులపై ఉంది.

#### దిగుబడి తగ్గితే.. అప్పులు ఎలా తీర్చాలి?

పత్తి సాగు కోసం ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేసిన రైతులు, ఆశించిన దిగుబడి వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. తీరా పంట చేతికందే సమయంలో తెగులు సోకడంతో వారి ఆశలు ఆవిరవుతున్నాయి. సాధారణంగా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించే రైతులు, ప్రస్తుత పరిస్థితుల్లో 3 నుంచి 4 క్వింటాళ్లు కూడా వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గడంతో పాటు పత్తి నాణ్యత దెబ్బతింటే గిట్టుబాటు ధర లభించదనే భయం వారిని వెంటాడుతోంది. మరోవైపు తెగులు నివారణ కోసం అదనంగా మందులు కొనుగోలు చేసి పిచికారీ చేయాల్సి రావడంతో పెట్టుబడి భారం మరింత పెరుగుతోంది.

#### రైతుల వద్దకు రాని అధికారులు!

పంటలు దెబ్బతింటున్న సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. ఏ తెగులు సోకింది, దాని నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఏ మందులు ఎంత మోతాదులో వాడాలనే అంశాలపై స్పష్టమైన సూచనలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారుల మార్గదర్శకాలు అందుబాటులో లేకపోవడంతో కొందరు రైతులు ప్రైవేట్ పురుగుమందుల దుకాణాల వ్యాపారులు సూచించిన మందులను కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నారని చెబుతున్నారు. అయినప్పటికీ ఆశించిన ఫలితం కనిపించకపోవడంతో మరింత నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### పంటను పరిశీలించి ఆదుకోవాలి

వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వెంటనే స్పందించి గ్రామాల వారీగా పత్తి చేలను పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. తెగులు తీవ్రతను గుర్తించి శాస్త్రీయ నివారణ చర్యలు సూచించడంతో పాటు, పంట నష్టాన్ని అంచనా వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంట నష్టం తీవ్రంగా ఉంటే ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులు పంట నష్టంతో మరింత ఆర్థిక సంక్షోభంలోకి జారిపోకుండా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

#### పెట్టుబడి కూడా దక్కేలా లేదు : కానుగుల మొగిలి, రైతు, చిట్యాల



'ఎకరాకు రూ.30 వేలకు పైగా అప్పులు తెచ్చి పత్తి సాగు చేశాను. పంట బాగా వస్తుందని ఆశించిన సమయంలోనే ఎర్ర తెగులు సోకి చేను దెబ్బతింటోంది. ఆకులు రాలిపోతున్నాయి.. పూత, కాయ నిలవడం లేదు. వేల రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటివరకు అధికారులు వచ్చి పంటను పరిశీలించలేదు. ఇలాగే కొనసాగితే పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. అధికారులు వెంటనే స్పందించి పంటను పరిశీలించి, మమ్మల్ని ఆదుకోవాలి.'

# బాసర గోదావరిలో మళ్లీ చిగురించిన ఆశలు

- 25 నెలల తర్వాత గంగపుత్రుల బోట్లకు మోక్షం



**బాసర, అక్టోబర్ 16(జనం సాక్షి) :** జ్ఞాన సరస్వతి నిలయమైన బాసర పుణ్యక్షేత్రంలో పవిత్ర గోదావరి తల్లి ఒడిలో 25 నెలలుగా నెలకొన్న నిశ్శబ్దాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ తొలగించారు. గోదావరిపైనే ఆధారపడి బతుకుతున్న 60 గంగపుత్ర కుటుంబాలకు ఆయన శుక్రవారం అక్షయ తృతీయ రోజున కొత్త జీవితాన్ని ప్రసాదించారు. 25 నెలలుగా అనుమతులు, సాంకేతిక కారణాలతో గోదావరిలో బోట్లు నిలిచిపోవడంతో బాసర గంగపుత్రులు ఉపాధి లేక అల్లాడిపోయారు. భక్తులను అవతలి ఒడ్డుకు చేర్చుతూ, గోదావరి హారతి, పడవ విహారాల ద్వారా వచ్చే ఆదాయమే వారికి జీవనాధారం. బోట్లు ఆగిపోవడంతో వందల మంది ఆకలితో అలమటించారు. గంగపుత్రుల కష్టాన్ని స్వయంగా తెలుసుకున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ చొరవ తీసుకున్నారు. ఉన్నతాధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో వరుసగా మాట్లాడి, అన్ని అడ్డంకులను తొలగించి, మళ్లీ బోట్లు నడిచేలా జీవో తెప్పించారు. ఈరోజు స్వయంగా బాసర గోదావరి ఘాట్ వద్ద బోట్లను జెండా ఊపి ప్రారంభించారు.

#### గంగపుత్రుల కన్నీటి ఆనందం

"ఉపాధి దొరకడంతో గంగపుత్రుల ఆనందానికి అవధులు లేవు. 25 నెలలుగా మేము పడిన కష్టాలు మాకే తెలుసు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ కష్టమైంది. మా గోస విని మాకు మళ్లీ బతుకు తెరువు చూపిన దేవుడు ఎమ్మెల్యే రామారావు పటేల్. ఆయన రుణం మేము ఎప్పటికీ మర్చిపోము, ఆయన మాకు అన్నం పెట్టారు' అంటూ గంగపుత్ర సంఘం సభ్యులు కృతజ్ఞతతో కన్నీరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బాసర సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, బాసర సీనియర్ బీజేపీ నాయకులు, గంగపుత్ర సంఘం అధ్యక్షులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోదావరిలో బోట్లు తిరగడంతో భక్తులకు కూడా మరింత సౌకర్యం కలగనుంది.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో అగ్నిప్రమాద నివారణ తప్పనిసరి

- అధికారులకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం
- రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్
- భైంసా ఏరియా ఆసుపత్రిలో మెరుగైన సేవలపై ఆరా



ముధోల్, అక్టోబర్ 16(జనం సాక్షి) ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్న నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను, వైద్యులను ఆదేశించారు. శుక్రవారం భైంసా పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి రోజూ వచ్చే ఓపీ, ఇన్-పేషెంట్ల సంఖ్య, వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు నిరంతర సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, అన్ని వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, నవజాత శిశువుల విభాగం (రాచీజఖ), రక్త పరీక్షల గది, మందుల స్టోర్ రూమ్ ను స్వయంగా పరిశీలించారు. రోగులకు అవసరమైన పరీక్షలు సకాలంలో చేసి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

#### రోగులతో ముఖాముఖి, అగ్నిమాపక వ్యవస్థపై కీలక ఆదేశాలు

తనిఖీలో భాగంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. అందుతున్న వైద్యం, మందులు, భోజనం, పరిశుభ్రతపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలు, టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో పటిష్టమైన అగ్నిప్రమాద నివారణ వ్యవస్థ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాల పనితీరు, వాటి గడువు తేదీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలూ సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ శశిభూషణ్, మున్సిపల్ కమిషనర్ సంతోష్, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను, వైద్య పరికరాలు, కార్డులు, రిజిస్టర్లు, వివిధ విభాగాలు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, చిన్నారుల చికిత్స విభాగం, ఐసియూ గదులను, పడకలు, పిల్లల విభాగంలో ఏసీలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతిరోజూ వచ్చే ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, వారి బరువు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించే విధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులకు వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ఇంకా సదుపాయాలు, వైద్య పరికరాలు, ఏసీలు ఇతరత్రా అవసరం ఉన్నట్లయితే వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని, మరమ్మతులకు గురైనట్లయితే వెంటనే మరమ్మతులు చేయించాలని, రోగులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రి అధికారులు కోరిన అవసరమైన సదుపాయాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం సేవించి వచ్చి గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ రోగులు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. అశోక్ కుమార్, ఆర్ఎంఓ డా. శ్రీధర్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## తప్పిపోయిన బాలికను గంటల వ్యవధిలో గుర్తించిన పోలీసులు..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తప్పిపోయిన రెండేళ్ల బాలికను గంటల వ్యవధిలో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు భూపాలపల్లి పోలీసులు. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో లక్ష్మీ నగర్ లో నివాసం ఉంటున్న ఛత్తీస్ గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ తన రెండేళ్ల కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన భూపాలపల్లి పట్టణ సీఐ సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఐ శ్రావణ్ కుమార్, సిబ్బంది మెట్టు శ్రీనివాస్, కానిస్టేబుల్ రాంబాబు తక్షణ చర్యలు చేపట్టి శాంతి నగర్ లో బాలికను గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ చిన్నారిని సురక్షితంగా అప్పగించిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, పండగ సమయంలో మరింత జాగ్రత్తగా గమనించాలని సూచించారు.

## బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా

**చెన్నారావుపేట, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చెన్నారావుపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గట్ల రాంబాబు శుక్రవారం తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు లేదని చెన్నారావుపేట స్థానిక బిఆర్ఎస్ లీడర్ల తీరుపై అసంతృప్తితో రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కేజీబీవీ అభివృద్ధికి రూ.56 లక్షలు..

- పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే



**దేవరుప్పుల, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో రూ.56 లక్షల వ్యయంతో చేపట్టనున్న మొదటి అంతస్తు మిగులు పనులను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. విద్యార్థినులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలోసర్పంజ్ పెద్ది కృష్ణమూర్తి దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెరా అనిల్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్



**వేములవాడ, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామివారిని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ లు తుల ఉమ, రాజన్నసిరిసిల్ల జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికారు. వారితో పాటు పలువురు మహిళా నాయకులు డాక్టర్ రమాదేవి, గంటల రేణుక, శాంతి నాయక్, అరుణ కొంగరి , అరుణ రెడ్డి, మమత, రజిత రావు, రాజ్యలక్ష్మి, చేరాల స్వాతి, చీటి సంధ్యారాణి, అనుచరులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన కరెంటు స్తంభాలు, తీగలు

- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం



**మాడుగులపల్లి, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** మండల పరిధిలోని ఇసుకబావిగూడెం గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదకు తెచ్చేలా ఉంది గ్రామంలోని పలు ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలను చెట్లు పూర్తిగా అల్లుకుని ప్రమాదకరంగా మారాయి స్తంభాలపైకి పెరిగిన చెట్ల కొమ్మల కారణంగా ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు గ్రామంలోని పలుచోట్ల విద్యుత్ లైన్ల మధ్యలో భారీగా పెరిగిన చెట్ల కొమ్మలు తీగలకు తగులుతున్నాయి ముఖ్యంగా వర్షాకాలం లేదా ఈదురుగాలులు వీచిన సమయాల్లో రాపిడికి గురై షార్ట్ సర్క్యూట్ ఏర్పడే ప్రమాదం పొగముంచుకుంది దీనివల్ల ఇళ్లలోకి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు, అకస్మాత్తుగా విద్యుత్ ప్రసారమై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, వెంటనే ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలని, పాతబడిన స్తంభాలను సరిచేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు లేనిపక్షం లో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## రంగారెడ్డి గూడెంలో నేడు బాలు నాయక్ పర్యటన



**పి.ఏ.పల్లి, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ పి.ఏ.పల్లి మండలంలోని రంగారెడ్డి గూడెం గ్రామంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నెర్మటి సతీష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 9 గంటలకు రంగారెడ్డి గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు అని,అనంతరం మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ఉదయం 10 గంటలకు పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో మరియు పట్టభద్రుల ఓటరు నమోదుపై నాయకులకు అవగాహన కల్పించడంతో పాటు,అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయడంపై చర్చించనున్నట్లు తెలిపారు.కావున కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,పట్టభద్రులు సకాలంలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

## రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- 80 ఫీట్ల రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేములవాడ, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** వేములవాడ మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులు, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనులు, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ఆర్ అండ్ బీ, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అధికారులు, మున్సిపల్, ఎన్ పీడీసీఎల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, తదితర నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ టవర్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేందుకు కార్మికుల సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఆలయ ఈఈ రాజేష్, ఎన్ పీడీసీఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపురం ఐటీ పార్కులో సిలిండర్ పేలుడు

- బీహార్ కార్మికుడు మృతి, మరో ఇద్దరికి గాయాలు

**చౌటుప్పల్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** యాదాద్రి-భువనగిరి జిల్లా పరిధిలోని చౌటుప్పల్ సమీపంలో గల మల్కాపురం గ్రామం ఐటీ పార్కులో శుక్రవారం ఘోర ప్రమాదం జరిగింది. ఇక్కడి ఆక్సినౌ మెడికల్ ఇండస్ట్రియల్ గ్యాసెస్ కంపెనీలో మధ్యాహ్నం సుమారు 2:00 గంటల సమయంలో ఒక్కసారిగా సిలిండర్ పేలింది. ఈ పేలుడు ధాటికి కంపెనీలో డైలీ లేబర్‌గా పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన మనీష్ కుమార్ (21) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి తండ్రి ధర్మేంద్ర పాస్వాన్ కాగా, వీరు ప్రస్తుతం మల్కాపురం గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. ఈ ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండు మైలారం గ్రామానికి చెందిన మాథరి హరిప్రసాద్ (23) అనే మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంపై సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. సిలిండర్ పేలడానికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# మార్నింగ్ వాక్ సురక్షిత ప్రాంతాల్లో చేయాలి

- రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** శుక్రవారం తెల్లవారుజామున సూర్యాపేట మండలం జనగామ హైవేపై బాలెంల గ్రామ స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. రోడ్డు ప్రమాదం జరగడానికి గల కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన నాగరాజు, సైదులు, జానయ్య అనే ముగ్గురు వ్యక్తులు తెల్లవారుజామున రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా వెనుక నుండి డీసీఎం వాహనం తగిలింది. ఈ ఘటనలో నాగరాజు, సైదులు మృతిచెందారు. జానయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు. సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ నందు కేసు నందు చేశారు. డీసీఎం డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడా లేదా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట డిఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ అనిల్ రెడ్డితో కలిసి ఎస్పి నరసింహ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. మన ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఉదయం వేళల్లో మార్నింగ్ వాక్ చేసే వారు జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ రహదారులు, రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై నడవకూడదని సూచించారు. మైదానాలు, పార్కులు, అందుబాటులో ఉన్న వెంచర్స్ లాంటి సురక్షితమైన ప్రదేశాల్లోనే నడక సాగించాలని అన్నారు. రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా వాహనాల రాకపోకలను గమనించి జాగ్రత్తగా దాటాలని తెలిపారు. రహదారుల పక్కన ఉన్న గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తెల్లవారుజామున పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రమాద సూచిక బోర్డులు, బ్లాక్ స్పాట్లు, తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు నిబంధనలను నిర్లక్ష్యం చేయడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. తొందరపాటు కంటే ప్రాణం ముఖ్యమని, కుటుంబ సభ్యులు మన కోసం ఎదురుచూస్తుంటారని గుర్తుంచుకుని సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఖమ్మం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** 2033-34 నాటికి విశాలమైన ఆర్థిక వ్యవస్థ, మెరుగైన ఆదాయం, పేదరిక నిర్మూలన, సుసంపన్నమైన భవిష్యత్ దిశగా ఖమ్మం అభివృద్ధి తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా అధికారులతో, కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన విజన్ 2047 డాక్యుమెంట్ కు అనుగుణంగా ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని అన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 74 ఏళ్ల వయసులోనూ పవర్ లిఫ్టింగ్‌లో పతకం

- భద్రాచలం వాసికి అంతర్జాతీయ గుర్తింపు
- కాంస్య పతకం సాధించిన డా. డీవీ శంకర్‌రావు



**భద్రాచలం, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, సంకల్పం ముందు వయోభారం అడ్డంకి కాదని భద్రాచలానికి చెందిన 74 ఏళ్ల సీనియర్ క్రీడాకారుడు డా. డీవీ శంకర్‌రావు నిరూపించారు. అమెరికాలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించి భద్రాచలం ప్రాంతానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. గుండెకు బైపాస్ శస్త్రచికిత్స జరిగినప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా సాధన కొనసాగించి పతకం సాధించడం విశేషం. ఆరోగ్యపరమైన సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ వేదికపై ప్రతిభ చాటిన ఆయన విజయంపై భద్రాచలం ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్‌లో కోచ్ జి.వి. రామిరెడ్డి పర్యవేక్షణలో శంకర్‌రావు ఈ పోటీలకు సిద్ధమయ్యారు. కోచ్ అందించిన శిక్షణ, మార్గదర్శకత్వంతో పాటు శంకర్‌రావు పాటించిన క్రమశిక్షణ, నిరంతర సాధన ఆయన విజయానికి దోహదపడ్డాయి. 74 ఏళ్ల వయసులోనూ క్రీడలపై మక్కువతో ముందుకు సాగి పతకం సాధించడం యువ క్రీడాకారులతో పాటు అన్ని వయసుల వారికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. శంకర్‌రావు విజయంపై రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోసెఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. మల్లేష్, భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్‌రెడ్డి, పాకాల దుర్గాప్రసాద్ అభినందనలు తెలిపారు. గ్రీన్ భద్రాద్రి, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా డా. డీవీ శంకర్‌రావుతో పాటు ఆయనకు శిక్షణనిచ్చిన కోచ్ జి.వి. రామిరెడ్డిని అభినందించారు. అనారోగ్య సమస్యలను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన శంకర్‌రావు పట్టుదల ఎంతో మందికి ఆదర్శమని పలువురు పేర్కొన్నారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యం



**బూర్గంపహాడ్, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచి, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బూర్గంపహాడ్ మండలంలోని ముసలిమడుగు గ్రామంలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం భూమిపూజ చేశారు. స్థానిక సర్పంచ్, ట్రాన్స్‌కో అధికారులతో కలిసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నూతన విద్యుత్ ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే ముసలిమడుగు పంచాయతీతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, ముసలిమడుగు సర్పంచ్ పూనెం సురేందర్, భద్రాచలం ట్రాన్స్‌కో డీఈ జీవన్ కుమార్, ఏడీఈ నర్సింహారావు, సారపాక ట్రాన్స్‌కో ఏఈ గుర్రం ఉపేందర్, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, వారాల వేణు, వివిధ పంచాయతీల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## సూర్యాపేట సమీపంలో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి

**సూర్యాపేట, అక్టోబర్ 16 (జనంసాక్షి) :** సూర్యాపేట మండలం బాలెంల గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున రోడ్డుపై వాకింగ్ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను వేగంగా వచ్చిన డీసీఎం వాహనం బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జనగాం వైపు నుండి సూర్యాపేట వైపు వెళ్తున్న డీసీఎం వాహనం బాలెంల స్టేజ్ సమీపంలో మార్నింగ్ వాకింగ్ చేస్తున్న గుర్రం సైదులు, ఆలకుంట్ల నాగరాజు, గొల్ల జానయ్యను ఢీకొట్టింది. సంఘటనా స్థలంలోనే సైదులుగా మరణించగా,తీవ్రంగా గాయపడిన ఆలకుంట్ల నాగరాజు, గొల్ల జానయ్యలను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆలకుంట్ల నాగరాజు మరణించారు. ప్రమాదంలో తలకు బలమైన గాయమైన గొల్ల జానయ్య ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. నిత్యం ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లే గ్రామస్థులు ప్రమాదానికి గురై మృతి చెందడంతో బాలెంల గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయండి



**హాలియా, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులను ఓటర్ల జాబితాలో వేగవంతంగా నమోదు చేయించాలని అన్నారు శుక్రవారం తన నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు హాలియా మున్సిపాలిటీలోని అన్ని వార్డుల కోఆర్డినేటర్లతో ముఖ్య సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదే కీలకమని అన్నారు. ప్రతి వార్డులో అర్హత కలిగిన పట్టభద్రులను గుర్తించి, వారికి అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేయించాలని వార్డు కోఆర్డినేటర్లకు దిశానిర్దేశం చేశారు. నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, ఒక్క అర్హుడైన పట్టభద్రుడు కూడా తప్పకూడదని సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, సంబంధిత అధికారుల వద్ద గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఓటరుగా నమోదైన వారు కూడా ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఫారం-18 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు యడవల్లి విజేందర్ రెడ్డి, రిక్కల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, పట్టభద్రులందరికీ ఓటు హక్కు గురించి తెలియజేసి, వారిని ఓటర్ల జాబితాలో చేర్చేందుకు కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వార్డు స్థాయిలో నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపాలిటీ వార్డు కోఆర్డినేటర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పెను విపత్తు కారణంగా వరి పంటలను వేయొద్దు

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి దాసరి హరి చందన
- వచ్చే ఎనిమిది నెలలు విద్యుత్, నీటిని పొదుపుగా వాడుకోవాలి
- శేరి లింగోటంలో ఎండిన వరి, పత్తి పంటల పరిశీలన

**కనగల్లు, అక్టోబర్ 16 (జనం సాక్షి) :** ఎల్‌నినో పెను విపత్తు పరిస్థితిలను దృష్టిలో ఉంచుకొని రైతులు యాసంగిలో ఎట్టిపరిస్థితులలో వరివేయవద్దని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖల కార్యదర్శి ఉమ్మడి నల్గొండ జిల్లా ఎల్ నినో ప్రత్యేక అధికారి దాసరి హరి చందనతెలిపారు. ఎల్. నీ. ఓ ప్రభావం కారణంగా వ్యవసాయ పంటలు, విద్యుత్ , సాగు, త్రాగునీరు, తదితర అంశాల పైఉమ్మడి నల్గొండ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సమీక్ష సమావేశంఅనంతరం ఆమె మండలం లోని శేరి లింగోటం గ్రామంలో నీటి ఎద్దడితో ఎండిపోయిన వరి రైతు ఆయుధగోని బిక్షం,పత్తి రైతు శ్రీనివాస్ గౌడ్ ల పంటపొలాలను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శేరి లింగోటం గ్రామానికి చెందిన వరి, పత్తి రైతులతో ఆమె ముఖాముఖి మాట్లాడుతూ,ఎల్ నినో ప్రభావం వల్ల వానాకాలం సరైన వర్షాలు రానందున, ఖరీఫ్ లో వరి పంట సాగు చేయవద్దని వ్యవసాయ అధికారులు, జిల్లా యంత్రాంగం పదేపదే రైతులకు చెప్పినప్పటికి జిల్లాలోని అనేక ప్రాంతాలలో వరి సాగు చేయడం జరిగిందని అన్నారు. వరి పంట చేతికొచ్చే దశలో భూగర్భ జలాలులేకవరిపంటలుఎండిపోతున్నాయని, అలాగే పత్తి పంటలు కూడా ఎండిపోతున్నాయని, దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం కలిగిందని అన్నారు. ఎల్ నినో వల్ల ఎక్కువనీరు అవసరం అయ్యే పంటలు వేస్తే భూగర్భ జలాల తగ్గి విద్యుత్ సరఫరాలో తీవ్ర కొరత లు ఏర్పడి వేసిన పంట చేతికి రాకపోతే రైతు తీవ్రంగా నష్టపోవలసి వస్తుందని, ఈ విషయాలన్నీ సొంతంగా అనుభవించిన రైతులు తోటి రైతులకు వారి అనుభవాలను తెలియజేయాలని, మరో రైతు నష్టపోకుండా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యాసంగిలో జిల్లా రైతులు బోర్లు, బావుల కింద ఎట్టి పరిస్థితులలో వరి వేయవద్దని, దీనివల్ల అన్ని రకాల ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. నీరు



అవసరమయ్యే స్వల్పకాలిక పంటలను సాగు చేసుకునేందుకు ప్రభుత్వం విత్తనాలు,ఇతర సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ఉద్యాన శాఖ అధికారి శేఖర్, మండల వ్యవసాయ అధికారి బి అమరేందర్ గౌడ్, ఏఈవో లు మౌనిక, దివ్య,స్థానిక సర్పంచ్ పోశ మల్ల సురేష్, బాధిత రైతులు పాల్గొన్నారు.



## బతుకమ్మ కేవలం ఉత్సవం కాదు... ప్రజా పోరాటాలకు ప్రతీక

- గ్రామీణ స్వయం సమృద్ధి కోసం బహుజన బతుకమ్మ పిలుపు
- వేములవాడలో బహుజన బతుకమ్మ వేడుకలు...
- ప్రజా గాయని విమలక్క..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (జనంసాక్షి):** వేములవాడలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకలకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు,ప్రముఖ ప్రజా గాయని విమలక్క బిజెపి కౌన్సిలర్ కుమ్మరి శంకర్ స్వగృహంలో స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చారు. ఈ సందర్భంగా ప్రజా గాయని విమలక్క మాట్లాడుతూ ఈ సంవత్సరం బహుజన బతుకమ్మ నినాదంతో ఊరూరు, వాడవాడలా తిరుగుతూ వేములవాడ వరకు తమ యాత్ర కదిలి వచ్చిందన్నారు. వేములవాడలోని మూలవాగు వద్ద ఆటపాటలతో నాలుగు మాటలు చెప్పుకొని,మళ్లీ ఊరూరు తిరగడానికి బహుజన బతుకమ్మ ముందుకు సాగుతుందన్నారు. ఈ ఏడాది బహుజన బతుకమ్మ ముఖ్యంగా గ్రామీణ ఉపాధి,స్వయం సమృద్ధి, గ్రామీణ రైతాంగం మరియు ప్రజాకాంక్షల నెరవేర్పు నినాదాలతో ముందుకు వచ్చిందని విమలక్క వివరించారు. గ్రామాలు స్వయం సమృద్ధితో వెలగాలంటే వ్యవసాయ భూములకు నీరుండాలని, అక్కడ పండిన పంటలపై రైతులకే సర్వహక్కులు ఉండాలని ఆకాంక్షించారు. ఇది కేవలం ఉత్సవమే కాకుండా ఒక ఉద్యమం లాంటిదని, ఆదివాసీల హక్కుల పరిరక్షణ, వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి కాపాడుకోవడం, మరియు రేపటి దేశ భవిష్యత్తైన యువత-రైతాంగం కలసి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ వీధుల్లో జరుగుతున్న యువత పోరాటాలకు తమ మద్దతు తెలియజేస్తూ, విద్యా ర్థులు, యువతపై జరిగిన దాడులను ఖండించారు. బాధ్యులైన అధికారులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ తరఫున అందరూ ఈ పోరాటాలకు చేయూతనందించాలని కోరారు.

# గడువులోగా అభివృద్ధి పనులు

- నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలి
- జీవో 76 దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన అక్టోబర్ 25లోగా పూర్తి చేయాలి
- ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి
- విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి
- నగరంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష..



జనవరి 15 నాటికి రామగుండం నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**గోదావరిఖని, జనంసాక్షి:** రామగుండం నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం నగరంలో విస్తృతంగా పర్యటించారు. రామగుండం?లింగాపూర్ రహదారి నిర్మాణ పనులు, రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్వహణ, 36వ డివిజన్‌లో జరుగుతున్న జీవో 76 దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శారదానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను, మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ రామగుండం?లింగాపూర్ రహదారి నిర్మాణ పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, నీటి పైపులైన్లను త్వరితగతిన మార్చేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాల మార్పిడి, పైపులైన్ల తరలింపు పనులను వెంటనే చేపట్టి, రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనులను వేగవంతం చేసి జనవరి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించే దిశగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల భవన పనులను పరిశీలించి, నిర్మాణ పనుల్లో వేగం పెంచి ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన వనరులను సమకూర్చుకొని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అక్టోబర్ 25లోగా పూర్తి చేయాలి..**

రామగుండం 36వ డివిజన్‌లో జరుగుతున్న జీవో 76 దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుల సంఖ్యను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించడంతో పాటు, సంబంధిత భూములు సింగరేణి సంస్థకు చెందినవా లేదా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, ధ్రువీకరణ ప్రక్రియను అక్టోబర్ 25లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని సదుపాయాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉన్నందున శస్త్రచికిత్సల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రజలు శస్త్రచికిత్సల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, శారదానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**మహిళా సమాఖ్యల సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి..**

మంథని మండలం చిల్లపల్లి గ్రామంలో గౌతమి మహిళా సమాఖ్య, రామగిరి మహిళా సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. ప్రస్తుతం ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, రోజుకు 6,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. అయితే ప్రత్యేక విద్యుత్ లైన్ అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం రోజుకు సుమారు 4,500 యూనిట్ల విద్యుత్‌ను గుంజపడుగు సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుకు సుమారు రూ. 28 లక్షల అంచనా వ్యయం అవసరమవుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుతో సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో టీజీఎంఎస్ఐడిసి అధికారి విశ్వప్రసాద్, టీజీఈడబ్ల్యుఐడిసి ఏఈ రమేష్, ఈఈ రామకృష్ణ, అదనపు డీఆర్డీఏ అధికారి రవీందర్, డీఈ ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ రహదారుల నిర్మాణం కోసం

## భూసేకరణ వేగవంతం



**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):** జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనుల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్ లో భూసేకరణ అంశంపై సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి పనులకు అవసరమైన భూసేకరణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అంశాలను చర్చించారు. భూములు కోల్పోయిన వారికి అందించాల్సిన పరిహారం, ఇప్పటికే పూర్తయిన పరిహారం చెల్లింపులు, మార్కెట్ రేటు, భూమి అప్పగించడంలో జాప్యం జరుగుతున్న చోట అందుకు గల కారణాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారుల నిర్మాణాలు, విస్తరణ పనుల భూసేకరణ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. భూసేకరణ విషయంలో నెలకొని ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, జాతీయ రహదారి సంస్థకు భూములు స్వాధీనం చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి , జాతీయ రహదారుల సంస్థ అధికారులు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగంపై విచారణ జరపాలి

**గంభీరావుపేట ఎస్ఐ, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి**



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 16, (జనంసాక్షి):** పత్రికల్లో వార్తా కథనాలు ప్రచురించిన జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్‌రావు డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ శేఖర్‌లను శుక్రవారం వారు పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ.. గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై వరుస కథనాలు ప్రచురించినందుకు జర్నలిస్టులపై ప్రతీకార చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం, పోలీసుల అదుపులో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. స్వతంత్ర విచారణ జరపాలి. పోలీసుల అదుపులో ఉన్న సమయంలో జర్నలిస్టుల మొబైల్ ఫోన్లు తీసుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఆలస్యంగా అందిందని బాధితులు తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు బాధ్యులైన పోలీసులపై విచారణ అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలో ఇలాంటి ఆరోపణలకు తావుండకూడదని స్పష్టం చేశారు. బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జర్నలిస్టులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## పేదలకు మెరుగైన సేవలందించడంలో రెడ్‌క్రాస్ ముందుండాలి




**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (జనంసాక్షి):** సమాజంలోని పేదలు, ఆపదలో ఉన్న వారికి మెరుగైన సేవలు అందించడంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందుండాలని జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సొసైటీ మానవతా సేవలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందేలా చర్యలు చేపట్టడంతో పాటు రక్తదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ప్రత్యేక రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం తరఫున త్వరలో స్థలం కేటాయిస్తామని తెలిపారు. రక్తనిధి కేంద్రం అందుబాటులోకి వస్తే అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్ పిలుపుకు స్పందించిన నూతన జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం. సంజీవరెడ్డి రక్తనిధి కేంద్రం నిర్మాణ పనుల కోసం రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

### రక్తనిధి కేంద్రానికి త్వరలో స్థలం కేటాయిస్తాం : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం**

జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా ఎం. సంజీవరెడ్డి, వైస్ చైర్మన్‌గా గోనేకర్ దస్థిరాం, కోశాధికారిగా గడ్డం రమేష్ రెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యునిగా ముసుకు జైపాల్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యవర్గ సభ్యులుగా దత్తాద్రి, గోవర్ధన్, శ్రీధర్, కృష్ణ, కుసుమ శ్రీకాంత్, సదాశివరెడ్డి, నాగరాజుగౌడ్, వెంకట్ రెడ్డి, బాలచంద్రం, కిరణ్, మరవెని రాజన్నలు బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 15 మంది సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పడింది. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వై.ఎన్. గిరి, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ డాక్టర్ శశికుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటి, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు అధికారిక ధ్రువీకరణ పత్రాలు అందజేసి శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

## లక్కీడ్రా ద్వారా బార్ లైసెన్సు

**కలెక్టర్ నేతృత్వంలో కొనసాగిన ప్రక్రియ**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (జనంసాక్షి):** బోధన్ పట్టణానికి నూతనంగా మంజూరైన మద్యం బార్‌కు లాటరీ ద్వారా లైసెన్సు జారీ కోసం శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో లక్కీ డ్రా నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఈ ప్రక్రియ కొనసాగింది. బార్ లైసెన్సు కోసం మొత్తం 19 దరఖాస్తులు దాఖలయ్యాయి. దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ లక్కీ డ్రా తీసి బార్ కేటాయింపు కోసం లైసెన్స్ ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, బోధన్ ఎక్సైజ్ సీ.ఐ భాస్కర్ అధికారులు ప్రక్రియలో పాల్గొన్నారు.



## 2027 గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**కోటి లింగాలలో పుష్కరాల అభివృద్ధి పనులు, ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

జగిత్యాల బ్యూరో అక్టోబర్ 16(జనంసాక్షి):2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని, వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో చేపడుతున్న గోదావరి పుష్కరాల అభివృద్ధి మరియు ఆలయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కోటిలింగాల ప్రాంతంలో పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పుష్కరాల నిర్వహణకు అవసరమైన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఆలయ నిర్మాణ పనులను కూడా సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. పుష్కరాలకు ముందుగానే అన్ని పనులు పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.



## బాన్సువాడలో స్వీట్‌షాపులు, బేకరీలపై ప్రత్యేక తనిఖీలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (జనంసాక్షి):** భారతీయ స్వీట్లు, బేకరీ ఉత్పత్తుల నాణ్యత, భద్రతపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని పలు స్వీట్‌షాపులు, బేకరీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి. విక్రమ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కొన్ని ఆహార వ్యాపార సంస్థలు ఈఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా దుకాణాల్లో పరిశుభ్రతకు సంబంధించిన పలు లోపాలను అధికారులు గుర్తించారు. అనుమానాస్పదంగా ఉన్న పలు ఆహార పదార్థాల నమూనాలను అక్కడికక్కడే సేకరించి, నాణ్యత నిర్ధారణ కోసం ల్యాబొరేటరీకి పంపించారు. నిబంధనలు పాటించకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారితో పాటు పరిశుభ్రత ప్రమాణాలు పాటించని నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల విక్రయంలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలు ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో దుకాణంలో పరిశుభ్రతను గమనించడంతో పాటు, ప్యాకెట్‌పై ఉన్న లేబుల్, తయారీ తేదీ, గడువు తేదీ తదితర వివరాలను పరిశీలించి కొనుగోలు చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం..

**సుందరగిరి,కొండాపూర్ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించిన విద్యుత్ శాఖ ఎస్ఈ విజయేందర్ రెడ్డి..**

**చిగురుమామిడి అక్టోబర్ 16 (జనంసాక్షి):** మండల పరిధిలోని సుందరగిరి,కొండాపూర్ గ్రామాల్లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో విద్యుత్ శాఖ ఎస్ఈ విజెందర్ రెడ్డి,డీఈ తిరుపతి,ఇందుర్తి ఏఈ అన్వేష్‌లు కలిసి స్థానిక పంట పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పొలాల వద్ద ఉన్న రైతులతో నేరుగా మాట్లాడారు. వ్యవసాయానికి అందుతున్న విద్యుత్ సరఫరాపై ఆరా తీస్తూ, రైతులకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పొలాల వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్లను సైతం పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేవని,సరఫరా సజావుగా సాగుతోందని స్పష్టం చేశారు. రైతులకు విద్యుత్ పరంగా ఎలాంటి అంతరాయాలు లేదా సమస్యలుంటే విద్యుత్ అధికారుల లేదా లైన్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని వారు కోరారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని,సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది,స్థానిక రైతులు పాల్గొన్నారు.



# డంపుయార్డుపై రాజకీయ డ్రామాలొద్దు

- ప్రజలు ఇబ్బంది పడుతుంటే రాజకీయ లబ్ధికోసం ప్రాకులాడడమేంటి ?
- సమస్య పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దాం
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్ బ్యూరో అక్టోబర్ 16 (జనంసాక్షి):** డంపు యార్డు సమస్య వల్ల ఒకవైపు ప్రజలు ప్రతి రోజూ ఇబ్బంది పడుతుంటే సమస్యను ఒకరిపై ఒకరు నెట్టివేసుకొని రాజకీయ లబ్ధికోసం ప్రాకులాడడమేంటని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. స్థానిక సుడా మాజీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్ చేయడంలో ఇప్పటివరకు ఒక అడుగు ముందుకు వేసి రెండు అడుగులు వెనక్కి వేస్తున్నారని ఒక్క మిషన్‌తో రోజుకు 5 వందల మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ బయోమైనింగ్ చేయలేమని,అక్కడ దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయి ఉందని,ప్రతి రోజు 5 వందల మెట్రిక్ టన్నులు బయోమైనింగ్ చేసినా 3 సంవత్సరాలు పడుతుందని అదీకాక మళ్లీ ప్రతిరోజూ ఫ్రెష్ వెస్ట్ 2 వందల మెట్రిక్ టన్నులు జమ అవుతూనే ఉంటుందని నరేందర్ రెడ్డి అన్నారు. సమస్య పరిష్కారం కావాలంటే నాలుగు మిషన్లతో ప్రతిరోజు 2 వేల మెట్రిక్ టన్నుల చెత్త బయోమైనింగ్ చేయగలిగితే ఒక సంవత్సరంలో ఉన్న చెత్త మొత్తం క్లియర్ చేయగలుగుతామని, దానికోసం ఒక ప్రణాళిక ప్రకారం కలిసికట్టుగా కృషి చేస్తేనే అది సాధ్యం అవుతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. యూసీఎఫ్ నిధులు సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయించుకొని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని దానికోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున మేము పూర్తి సహకారం అందిస్తామన్నారు. గతంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా పూర్తిగా డంపు యార్డు ఖాళీ చేయగలిగే మంచి అవకాశం వచ్చిందని ఆనాడు స్మార్ట్ సిటీ బోర్డులో ఉండి కీలక నేతగా వ్యవహరించిన ఆనాటి మేయర్ పాలకవర్గం చిత్తశుద్ధి ప్రదర్శించకపోగా ఈనాటి పాలకవర్గంలో మరియు బీజేపీ పార్టీలో కీలక పదవి పొందిన వ్యక్తిని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బ్యాక్ ఫ్రంట్ పెట్టుకుని ఇతరులను నిందించే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. తడి చెత్త వేరుగా పొడి చెత్త వేరుగా సేకరించడంలో పాలకవర్గాలు విఫలమవుతున్నాయని మానిటరింగ్ సరిగా చేస్తే ఫ్రెష్ వెస్ట్ ను తగ్గించవచ్చని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతానికి పొగ బారినుండి ఉపశమనం పొందేందుకు నాలుగు వైపులా బోర్లు వేసి స్ప్రింక్లర్లు ఏర్పాటు చేస్తే సత్వరం పొగకు పరిష్కారం దొరుకుతుందని నిపుణులు సూచిస్తున్నారని ఆదిశగా ప్రయత్నం చేయాలని నరేందర్ రెడ్డి కోరారు. నాయకులు క్రెడిట్ కోసం ప్రాకులాడడం మాని చిత్తశుద్ధి తో ముందుకు సాగాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందించడానికి మేము సిద్ధంగా ఉన్నామని నరేందర్ రెడ్డి అన్నారు. మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ ఎండి తాజ్, కార్పొరేటర్లు పర్వతం మల్లేశం, వరాల నర్సింగం,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,లాయక్,మామిడి సత్యనారాయణ రెడ్డి,ఎండి చాంద్,జీడి రమేష్, దండి రవీందర్,గుడిపాటి రమణారెడ్డి,బషీర్,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూరు మండల కేంద్రంలో డివైడర్ లైటింగ్ మరమ్మత్తులు

**పండగ వేల పున్నమి వెలుగులతో పట్టణకేంద్రం: సర్పంచ్ రేఖ సుదర్శన్**

**భిక్కనూరు అక్టోబర్ 16 (జనం సాక్షి):** భిక్కనూరు మండల కేంద్రంలో డివైడర్ సెంట్రల్ లైటింగ్ కొరకు లక్షల రూపాయల నిధులతో అప్పుడు ఏర్పాట్లు చేసి కళకళలాడిన పట్టణం పండగ వేల వెలిగివేలగని డివైడర్ సెంటర్ లైట్స్‌లి భిక్కనూరులో పండగవేల వెలిగివేలుగని సెంట్రల్ లైట్లు అప్పుడు వెలుగులు...ఇప్పుడు చీకట్లో ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు.లిజనంసాక్షి వార్త కథ నానికిలి స్పందించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్, ఉపసర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్,వార్డు సభ్యులతో కలిసి శుక్రవారం రోజున లైటింగ్ మరమ్మతులు చేపట్టారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ఆడపడుచుల అతిపెద్ద పండుగ బతుకమ్మ,దసరా పండగవేల మండల కేంద్రంలో రద్దీపెరిగే అవకాశం ఉన్నందున పట్టణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ తెలిపారు. బతుకమ్మ దసరా పండగలకు కావలసిన సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని పండగలను ప్రజలందరూ సంతోషంగా సురక్షిత వాతావరణంలో జరుపుకోవాలని ఈసందర్భంగా తెలిపారు.


భిక్కనూరులో పండగ వేల వెలిగి వెలగని సెంట్రల్ లైట్లు అంధకార ఛాయలు!
- లక్షలతో సెంట్రల్ లైట్స్ ఏర్పాట్లు.. మరమ్మత్తులకు నోచుకోని వెలుగులు
- అప్పుడు వెలుగులు.. ఇప్పుడు చీకట్ల మాయం
- బతుకమ్మ,దసరా పండగల సమయంలో వెలుగులు లేక ప్రజలకు తప్పని రాత్రివేళ ఇబ్బందులు

జనంసాక్షి 14 Oct 2026 - Page 11 https://epaper.janamsakshi.org/clip/563415

# అటవీ అధికారులకు భద్రత..

- అటవీ భూముల పరిరక్షణపై సమీక్ష..
- పోలీసు,అటవీ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలి..
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..



**గోదావరిఖని, జనంసాక్షి :** అటవీ అధికారులకు భద్రత.. పదవి భూముల పరిరక్షణపై సమీక్ష.. పోలీస్ అటవీ శాఖ మధ్య సమన్వాన్ని బలోపేతం చేయాలని గ్రామంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ఝా అన్నారు. శుక్రవారం సీపీ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,పెద్దపల్లి డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, మంచిర్యాల డీఎఫ్ఓ రాహుల్ జాదవ్, ఏసీపీలతో కలిసి అటవీ అధికారులకు భద్రత,అటవీ భూముల పరిరక్షణ, ప్రజలతో అటవీ శాఖ సిబ్బంది సమన్వయం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలతో సమన్వయంతో పనిచేస్తూ,వారితో సత్సంబంధాలను కొనసాగించాలని సూచించారు.అటవీ చట్టాలు, నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాలని తెలిపారు.

అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులు చేయడం,విధుల నిర్వహణకు ఆటంకం కలిగించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి ఘటనలను తీవ్రంగా పరిగణించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మహిళా అటవీ ఉద్యోగులతో సహా విధుల్లో ఉన్న అటవీ సిబ్బందికి తగిన భద్రత కల్పించాలని సూచించారు.అటవీ సిబ్బందిపై జరిగిన దాడులు,విధులకు ఆటంకం కలిగించిన ఘటనలను సమీక్షించి, సంబంధిత కేసుల్లో చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొక్కల పెంపకం, అటవీ సరిహద్దుల నిర్ధారణ,ఆక్రమణల నుంచి విముక్తి కల్పించిన రిజర్వ్ ఫారెస్ట్ భూముల పరిరక్షణ వంటి కార్యక్రమాల నిర్వహణలో అటవీ సిబ్బందికి అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించాలని తెలిపారు.

అటవీ అధికారులపై దాడులు,విధులకు ఆటంకం,సిబ్బందిని అక్రమంగా నిర్బంధించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, అధికారులను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం తక్షణమే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కేసులపై నిష్పక్షపాతంగా దర్యాప్తు పూర్తి చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ భూముల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణను సమర్థవంతంగా అమలు చేయడానికి పోలీసు,అటవీ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

ప్రభుత్వ అటవీ సంరక్షణ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడడంతో పాటు, అటవీ సిబ్బందికి తగిన భద్రత కల్పించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అన్ని స్థాయిల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జాప్యీూ నిధులపై ప్రతికూల ప్రభావం పడకుండా ప్రభుత్వ కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు క్షేత్రస్థాయిలో పోలీసు,అటవీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గోపి,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ,సర్వేశ్వర్ డీసీఎఫ్,జి. రామూర్తి,ఎఫ్‌డీఓ కాగజ్‌నగర్ రామమోహన్, ఎఫ్‌డీఓ జన్నారం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ డిమాండ్..**

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు.శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలపై స్పందించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రామగుండం ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఒకప్పుడు సింగరేణి కార్మికుల హక్కులు, తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడిన నాయకులు అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. కేటీఆర్ రామగుండం పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తీవ్రంగా ఖండించారు. ఇతర ప్రాంతాలైన బెల్లంపల్లి, మంచిర్యాల, శ్రీరాంపూర్ నుంచి ప్రజలను తీసుకొచ్చి రామగుండంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే అవకాశం కల్పించినందుకు కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.సింగరేణి కార్మికులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన కాసోజు శ్రీకాంతాచారి మీకు గుర్తుకు రాలేదు కానీ, గోదావరిఖని బిడ్డ, మా తమ్ముడు, ప్యారడైజ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల గురించి మాత్రం మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్ అన్న మరణించినప్పుడు ఆయన అంత్యక్రియలకు కూడా మీరు హాజరు కాలేదని విమర్శించారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



# జనాభా గణన--2027 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- జనాభా గణనను పకడ్బందీగా నిర్వహించాలి
- శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (జనం సాక్షి):** జనాభా గణన--2027ను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. జనాభా గణన--2027 రెండో దశకు సంబంధించి సెన్సెస్ ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో జిల్లాలోని 25 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు చెందిన సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన అత్యంత కీలకమైన జాతీయ కార్యక్రమమని, ఇందులో సేకరించే ప్రతి వివరాన్ని అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. శిక్షణా తరగతులను సిబ్బంది సద్వినియోగం చేసుకుని, గణనకు సంబంధించిన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. గణన ప్రక్రియలో సాంకేతిక అంశాలపై కూడా సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

శిక్షణలో భాగంగా జనాభా గణనకు సంబంధించిన 40 రకాల ప్రశ్నలు, వాటి ద్వారా సమాచారాన్ని సేకరించే విధానం, స్వీయ గణన ప్రక్రియ, సి.ఎం.ఎం.ఎస్. పోర్టల్‌లో చేపట్టాల్సిన సాంకేతిక ప్రక్రియలపై మాస్టర్ ట్రైనర్లు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను కూడా వివరించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి రఘునందన్, జిల్లా గణాంకాల అధికారి కార్యాలయానికి చెందిన మాస్టర్ ట్రైనర్లు భుక్య రవికుమార్, ఏ.ఆర్. యుగంధర్ బాబు, సెన్సెస్ ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి నిజాంసాగర్‌లో బెల్టు షాపుల జోరు!

**గ్రామగ్రామాన నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు.. పట్టించుకోవడం లేదని ఎక్సైజ్, పోలీసు శాఖలపై ప్రజల అసంతృప్తి**

**నిజాంసాగర్, అక్టోబర్ 16 (జనం సాక్షి):** ఉమ్మడి నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా మద్యం అందుబాటులో ఉంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల యువత మద్యానికి అలవాటు పడే ప్రమాదం పెరుగుతోందని, కుటుంబాలపై కూడా ఆర్థిక, సామాజిక ప్రభావం పడుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

### ప్రధాన రహదారిపైనే మద్యం విక్రయాలా?

మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో బోధన్--మెదక్ ప్రధాన రహదారి పక్కన మినీ మద్యం దుకాణాన్ని తలపించే విధంగా ఒక బెల్టు షాపు కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని మరికొన్ని గ్రామాల్లోనూ బహిరంగంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. గ్రామాల్లో మద్యం సులభంగా అందుబాటులో ఉండటంతో యువతతో పాటు ఇతరులు కూడా మద్యపానానికి ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### యువత భవిష్యత్తుపై ఆందోళన

యువత దేశానికి, సమాజానికి వెన్నెముకగా నిలవాల్సిన సమయంలో మద్యానికి బానిసలైతే వారి ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మద్యపానం వల్ల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, గొడవలు పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా రోజువారీ కూలీలు, పేద కుటుంబాలపై అదనపు భారం పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలపై నియంత్రణ లేకపోతే సామాజిక సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని, యువతను మద్యపానానికి దూరంగా ఉంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### అధికారులకు తెలిసినా చర్యలు లేవా?

బెల్టు షాపుల నిర్వహణపై సంబంధిత పోలీసు, ఆబ్కారీ శాఖ అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ తగిన చర్యలు కనిపించడం లేదని ఉమ్మడి మండలాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత శాఖల అధికారుల వివరణ తెలియాల్సి ఉంది. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### బెల్టు షాపులకు అడ్డుకట్ట వేయాలి

ఉమ్మడి నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయించే వారిని గుర్తించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, గ్రామ కూడళు,, జనావాసాల సమీపంలో జరుగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న మద్యం విక్రయాలపై అధి కారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, బెల్టు షాపులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, యువతను మద్యపాన వ్యసనం నుంచి దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉమ్మడి మండలాల ప్రజలు కోరుతున్నారు.





# పెద్దకొడప్గల్ మండలం కాటేపల్లిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ

- డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ చొరవ..
- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కృషితో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం





**కామారెడ్డి, అక్టోబర్ 16 (జనం సాక్షి):** పెద్దకొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో విద్యుత్ సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఈరోజు జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతరావు కామారెడ్డి జిల్లా (డిసిసి)అధ్యక్షులు శ్రీ ఏలే మల్లికార్జున్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపి విద్యుత్ సదుపాయాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పెద్దకొడప్గల్ మండలంలోని ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించి, నిరంతర విద్యుత్ సరఫరా దిశగా చర్యలు చేపట్టడంలో భాగంగా కాటేపల్లి గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రైతులకు ప్రయోజనం.. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు, విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు, వ్యవసాయ అవసరాలకు మరియు గృహ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు దోహదపడనుంది. కాటేపల్లి గ్రామంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టిన ఈ కార్యక్రమం పెద్దకొడప్గల్ మండల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే దిశగా ముందడుగుగా నిలవనుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం కీలకంగా మారనుందని తెలిపారు. పెద్ద కొడప్గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వెలవెలబోతున్న బతుకమ్మ తల్లి విగ్రహాలు!

**రంగులు వెలిసి.. కళ తప్పి..**
**ఆదరణకు నోచుకోని తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు**

**ప్రత్యేక కథనం:**

**శంకరపట్నం, అక్టోబర్ 16, జనం సాక్షి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ తల్లి విగ్రహాలు నేడు కళావిహీనంగా మారుతున్నాయి. గతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహాలు ఒకప్పుడు రంగురంగుల అలంకరణలతో చూపరులను ఆకట్టుకునేవి. పండుగ సమయాల్లో మహిళల్లో ఉత్సాహాన్ని నింపుతూ, గ్రామాల్లో తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పేవి. అలాంటివి నేడు సరైన నిర్వహణ లేక, రంగులు వెలిసిపోయి వెలవెలబోతుండటం స్థానికులను ఆవేదనకు గురిచేస్తోంది.



### రంగులు వెలిసి.. కళ తప్పి..

తెలంగాణ రాష్ట్ర పండుగైన బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో గ్రామగ్రామాన బతుకమ్మ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, పూల పండుగ వైభవానికి ప్రతీకలుగా వీటిని తీర్చిదిద్దారు. ప్రారంభంలో ఆకర్షణీయమైన రంగులు, అందమైన అలంకరణలతో విగ్రహాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. అయితే కాలక్రమేణా వాటి నిర్వహణపై శ్రద్ధ తగ్గడంతో రంగులు వెలిసిపోయి, గత వైభవాన్ని కోల్పోయాయి. ఒకప్పుడు కళకళలాడిన విగ్రహాలు నేడు వెలవెలబోతూ కనిపిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పాలకవర్గాలు లేక.. పట్టించుకునేవారు కరువై..

గత రెండున్నరేళ్లుగా గ్రామాల్లో స్థానిక పాలకవర్గాలు లేకపోవడంతో పలు అభివృద్ధి, నిర్వహణ పనులపై నిర్లక్ష్యం నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బతుకమ్మ తల్లి విగ్రహాలకు సకాలంలో రంగులు వేయడం, పరిసరాలను శుభ్రం చేయడం, పండుగకు అనుగుణంగా అలంకరించడం వంటి పనులు సక్రమంగా జరగకపోవడంతో వాటి పరిస్థితి అధ్వానంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే విగ్రహాలే ఇలా నిరాదరణకు గురికావడం బాధాకరమని మహిళలు అంటున్నారు.

### కొత్త సర్పంచులైనా స్పందించేనా?

ప్రస్తుతం కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఈ బతుకమ్మ పండుగ తొలి పరీక్షగా నిలుస్తోంది. గ్రామాల్లో బతుకమ్మ సంబరాలకు సన్నద్ధమవుతున్న తరుణంలో విగ్రహాలకు కొత్త రంగులు అద్ది, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు. విగ్రహాల చుట్టూ పరిసరాలను శుభ్రం చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టి, పండుగకు ముందే వాటికి పూర్వవైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### సంస్కృతిని కాపాడటం మనందరి బాధ్యత

బతుకమ్మ పండుగ అంటే కేవలం పూలతో ఆడుకునే వేడుక మాత్రమే కాదు.. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆడపడుచుల ఐక్యతను, ప్రకృతితో మమేకమైన జీవన విధానాన్ని ప్రతిబింబించే గొప్ప సాంస్కృతిక సంప్రదాయం. అలాంటి పండుగకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ తల్లి విగ్రహాలు నిర్లక్ష్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులపై ఉంది. ఇప్పటికైనా స్పందించి విగ్రహాలకు రంగులు అద్ది, వాటి పరిసరాలను అందంగా తీర్చిదిద్దితే పండుగకు మరింత శోభ చేకూరుతుందని గ్రామీణ మహిళలు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వెలిసిపోయిన రంగుల స్థానంలో కొత్త వెలుగులు నింపి.. కళ తప్పిన బతుకమ్మ తల్లి విగ్రహాలకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా కొత్త పాలకవర్గాలు చొరవ చూపుతాయా? అన్నది వేచి చూడాలి.

# భీంగల్ బాపూజీ నాగర్ కాలనీలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**భీంగల్, అక్టోబర్ 16, జనం సాక్షి:** కుటుంబ మనస్పర్థల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భీంగల్ మండల కేంద్రంలోని బాపూజీనగర్ కాలనీలో చోటుచేసుకొంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల మేరకు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బాపూజీనగర్ కాలనిలో నివాసం ఉంటున్న దావూద్ స్వస్థలం కోరుట్ల మండలానికి చెందినవారు కాగా, గత 15 సంవత్సరాల నుండి భీంగల్ లోనే నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. కాగా కోరుట్లలో తన తల్లి, చెల్లెలు కలిసి ఉంటుండగా వారు ఉన్న ఇల్లు అమ్మే విషయమై వారి మధ్య మనస్పర్థలు, వివాదాలు తలెత్తాయి. ఈ విషయమై దావుద్ కుమారుడు షేక్ రహీం రెండు రోజుల క్రితం కోరుట్ల వెళ్లి నిన్న సాయంత్రం 6:30 గంటలకు తిరిగి భీంగల్ కు వచ్చాడు. రాత్రి నిద్రపోగా, శుక్రవారం ఉదయం సుమారు 4:00 గంటలకు అతని భార్య పని నిమిత్తం బయటకు వెళ్లగా, ఉదయం 7:30 గంటల ప్రాంతంలో ఇంట్లో వారి పిల్లలు బయట ఉండగా, గది తలుపులు లోపల నుండి గడి వేసి ఉండటంతో పిల్లలు ఎంత పిలిచిన తలుపు తీయలేదు. వెంటనే అతని కూతురు కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా షేక్ రహీం రేకుల పైకప్పుకు ఉన్న ఇనుప రాడ్ కు చున్నితో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. మృతుని భార్య షేక్ షహీనా ఫిర్యాదు ప్రకారం, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# చెరువుల పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలి

## రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ స్పీకర్ మీట్ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ పిలుపు

**హైదరాబాద్, అక్టోబర్ 16:** సమాజ శ్రేయస్సుతో పాటు పర్యావరణ పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. చెరువుల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతను కాపాడడం, విపత్తుల నివారణలో ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలతో పాటు కార్పొరేట్ సంస్థలు కూడా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఐటీసీ కోహినూర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్-3150 ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్పీకర్ మీట్ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడారు. అధ్యక్షులు రొటేరియన్ రమేష్ పటేల్, కార్యదర్శి రొటేరియన్ శాంతి పాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ ఏవీ రంగనాథ్ గారు మాట్లాడుతూ చెరువులు, నాళాల పరిరక్షణ, పునరుద్ధరణతో పాటు ప్రభుత్వ భూములు పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలను వివరించారు.

చెరువులను పునరుద్ధరించడం, వర్షపు నీరు చెరువుల్లోకి చేరేలా ఇన్‌లెట్ నాలాలను అభివృద్ధి చేయడం, నీటి ప్రవాహానికి కాలువల్లో ఉన్న అడ్డంకులను తొలగించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెరువుల పునరుద్ధరణ వల్ల వరద ముప్పు తగ్గడంతో పాటు భూగర్భ జలాల నిల్వలు పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదిక హైడ్రా**




**ప్రజావాణి**

హైడ్రా ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి విజయవంతమైన వేదికగా నిలుస్తోంది.
ప్రతి సోమవారం ప్రజల ఫిర్యాదుల స్వీకరణతోనే మా పనులు ప్రారంభమవుతాయి.
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.
ప్రజల నుంచి వస్తున్న స్పందనే ప్రజావాణి విజయానికి నిదర్శనం అన్నారు. ఆక్రమణలను తొలగించడంతో కబ్జాదారుల చెరలో ఉన్న సుమారు 3 వేల ఎకరాలను ఈ రెండేళ్లలో కాపాడమని కమిషనర్ చెప్పారు. చెరువులు, నాలాలు, పార్కులు, రహదారులు, ప్రభుత్వ బహిరంగ స్థలాల పరిరక్షణకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత రికార్డుల తనిఖీ, అవసరమైన చట్టపరమైన ప్రక్రియ అనంతరం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

**విపత్తు వచ్చిన తర్వాత కాదు ముందే**

**నివారణ**

హైడ్రా కేవలం ఆక్రమణలను తొలగించే సంస్థ మాత్రమే కాదని, విపత్తులను ముందుగానే గుర్తించి నివారించడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను కాపాడే బాధ్యతను నిర్వర్తిస్తోందని శ్రీ ఏవీ రంగనాథ్ గారు తెలిపారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం భవిష్యత్ తరాల ప్రయోజనాలకు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు.

# కరువు ముప్పు నుంచి కాపాడు తల్లి..

**ప్రభుత్వం తరపున జోగులాంబ అమ్మవారికి మంత్రి వాకిటి శ్రీహరి దంపతుల పట్టు వస్త్రాల సమర్పణ**

**అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం నా పూర్వజన్మ సుకృతం : మంత్రి**

**గద్వాల (జనంసాక్షి):** దసరా శరన్నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శక్తిపీఠం అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రిదంపతులకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.
ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో మంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మీడియా తో మాట్లాడుతూ.. జగన్మాత జోగులాంబ అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం తనకు లభించిన గొప్ప ఆధ్యాత్మిక భాగ్యమని అన్నారు. ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రాన్ని, దేశాన్ని కరువు ముప్పు నుంచి కాపాడాలని జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి



తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయం సజావుగా సాగాలని, రైతుల కష్టాలు తొలగి ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.
ప్రకృతి అనుకూలించి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలియజేశారు.



# రష్యా సైన్యంలో చేరిన నలుగురు తెలంగాణ వాసులు సురక్షితమేనా..?

**వివరాలు తెలుపాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కు సూచించిన సీఎం ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి**

**262 వ సీఎం ప్రజావాణిలో 105 దరఖాస్తులు**

**హైదరాబాద్ (జనంసాక్షి):** రష్యా సైన్యంలో ఏజెంట్స్ మోసపూరిత మాటలతో చేరిన నలుగురు తెలంగాణ వాసులు సురక్షితమేనా..?, పూర్తి వివరాలు తెలుపాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు సీఎం ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో జరిగిన 262వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో... రష్యా సైన్యంలో చిక్కుకున్న నలుగురు వ్యక్తుల కుటుంబ సభ్యులు మరోసారి వచ్చి గద్వాల్ విజయలక్ష్మిని కలిసి తమ వారి ఆచూకీ కనుగొనాలని కోరారు.
నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ ఉమ్మడి జిల్లా కు చెందిన భూక్య రవీందర్ సిద్దుల అశోక్ ప్రకాష్ మహమ్మద్ అబ్బర్ ఖాన్ లను రష్యాలో ఆయిల్ కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి తీసుకెళ్లి మాయమాటలు చెప్పి రష్యా సైన్యంలో చేర్పించడంతో ఆ నలుగురు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులు సీఎం ప్రజావాణిని ఆశ్రయించారు.
ఈ నలుగురిని మోసపూరితంగా రష్యాకు తరలించిన ఏజెంట్ ఉత్తరప్రదేశ్ కు చెందిన గౌరవ్ ను నిజామాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరు పరచగా.. కోర్టు ఆదేశాల మేరకు అతన్ని స్థానిక ఖిల్లా జైలుకు తరలించిన విషయం సీఎం ప్రజావాణి ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి వచ్చింది. వెంటనే నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో



ఫోన్లో మాట్లాడిన గద్వాల్ విజయలక్ష్మి.. రష్యా సైన్యంలో ఆ నలుగురు వ్యక్తులు సురక్షితంగా ఉన్నారా లేదా అన్న విషయం ఆరా తీసి తమకు సమాచారం ఇవ్వాలని, ఆ వివరాలు త్వరలోనే తెలుపుదామని తెలుపుతామని నిజామాబాద్ సిపి సమాధానం ఇచ్చారు.
కాగా హైదరాబాద్ నగరం ఉప్పల్ కు చెందిన జయంత్ అనే విద్యార్థి కూడా రష్యాకు చదువుకోవడానికి వెళ్లి పొరపాటున ఆశతో రష్యా పోలీస్ విభాగంలో చేరిన విషయం కూడా సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు అందింది.
మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన 262వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 105 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 25, హోం శాఖకు 14, బీసీ శాఖకు 15, ఇతర శాఖలకు 51 దరఖాస్తులు అందాయి. ఈ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి, నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ.పీ.పీ. ఉమేందర్, ఎన్. ఆర్. ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో మహిళకు వల

- ఉప్పల్‌లో మ్యాట్రిమోనీ మోసగాడి అరెస్ట్!
- షాదీ.కామ్‌లో నకిలీ ప్రొఫైల్ సృష్టించి పరిచయం..
- రైల్వే శాఖలో సెక్షన్ ఇంజినీర్‌నంటూ నమ్మబలికిన నిందితుడు




**ఉప్పల్, అక్టోబర్ 16 (జనం సాక్షి):** పెళ్లి సంబంధాల కోసం ఆన్‌లైన్ వేదికలను ఆశ్రయిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వివాహం చేసుకుంటానని నమ్మించి పరిచయం పెంచుకోవడం, తప్పుడు ఉద్యోగ వివరాలతో ఎదుటివారిని విశ్వసించేలా చేయడం, అనంతరం వారి నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడటం వంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెళ్లి పేరుతో మహిళను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
షాదీ.కామ్‌లో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, తాను రైల్వే శాఖలో సెక్షన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నానని నమ్మించి మహిళకు దగ్గరైన నిందితుడు.. అనంతరం ఆమెను లైంగికంగా వేధించి, బెదిరింపులకు పాల్పడటంతో పాటు రూ.1.10 లక్షలు వసూలు చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో నకిలీ ప్రొఫైల్**

పోలీసుల వివరాల ప్రకారం.. పుల్లగూర సూర్యనారాయణ (33) అనే వ్యక్తి షాదీ.కామ్ అనే ఆన్‌లైన్ మ్యాట్రిమోనీ వేదికపై నకిలీ ప్రొఫైల్ సృష్టించాడు. వివాహ సంబంధాల కోసం వెతుకుతున్న మహిళలను పరిచయం చేసుకునే ఉద్దేశంతో తన వివరాలను నమ్మదగిన రీతిలో చూపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాను రైల్వే శాఖలో సెక్షన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నానని పేర్కొంటూ మహిళను నమ్మించాడు.
ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి కావడంతో తనను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడని ఆమె విశ్వసించేలా వ్యవహరించినట్లు తెలుస్తోంది. సాధారణంగా మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో పరిచయమయ్యే వ్యక్తుల ఉద్యోగం, కుటుంబ నేపథ్యం, ఆదాయం, ఇతర వ్యక్తిగత వివరాలను ఆధారంగా చేసుకుని వివాహ సంబంధాలపై నిర్ణయాలు తీసుకుంటారు.
ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని నిందితుడు తప్పుడు వివరాలతో మహిళకు పరిచయమయ్యాడని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. అయితే, నిందితుడు పేర్కొన్న ఉద్యోగ వివరాలకు సంబంధించిన పూర్తి వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**పెళ్లి చేసుకుంటానని నమ్మించి**

**దగ్గరైనట్లు ఆరోపణలు**

నకిలీ ప్రొఫైల్ ద్వారా పరిచయం ఏర్పడిన అనంతరం నిందితుడు మహిళతో సన్నిహితంగా మెలిగినట్లు పోలీసుల వివరాలు సూచిస్తున్నాయి. ఆమెను పెళ్లి చేసుకుంటానని హామీ ఇస్తూ మాయమాటలు చెప్పి నమ్మకం కలిగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో మహిళతో లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. వివాహం చేసుకుంటాననే నమ్మకంతో మహిళ అతడితో సంబంధాన్ని కొనసాగించినట్లు తెలుస్తోంది.
అయితే, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు వివాదానికి దారితీశాయి. పెళ్లి పేరుతో నమ్మించి తనను మోసం చేయడంతో పాటు లైంగికంగా వేధించాడని బాధితురాలు ఆరోపించింది. ఈ వ్యవహారంలో నిందితుడి ప్రవర్తన, మహిళ చేసిన ఆరోపణలు, వాటికి సంబంధించిన ఆధారాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

**బెదిరింపులతో రూ.1.10 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదు**

ఈ ఘటనలో అత్యంత కీలకమైన అంశం డబ్బుల వసూలు. మహిళను నమ్మించి, అనంతరం బెదిరింపులకు పాల్పడుతూ మోసపూరితంగా ఆమె నుంచి రూ. 1,10,000 వసూలు చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివాహం చేసుకుంటానని నమ్మించి తనతో సంబంధం కొనసాగించడంతో పాటు డబ్బులు తీసుకుని వేధింపులకు గురిచేశాడని ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది.
ఎవిచారణలో భాగంగా పుల్లగూర సూర్య నారాయణ (33)ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడైంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు, ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగాల్సి ఉంది.

# ఉద్యమకారులకు జర్నలిస్టులకు .. సముచిత స్థానం కల్పించాలి

**ఏఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాష్ నాయక్**



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి ) తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ఉద్యమకారులతో పాటు యావత్ తెలంగాణ ప్రజానీకం చేసిన ప్రతి ఆందోళన కార్యక్రమాన్ని జర్నలిస్టులు సమాజానికి చూపించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ఉద్యమకారులతో పాటు జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని ఏఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాష్ నాయక్ అన్నారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల వివరాలను నమోదు చేసుకోవడానికి కొత్త వెబ్సైట్‌ను తీసుకురావడం అభినందించదగ్గ విషయమని ఈ పథకాన్ని తెచ్చినందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యమాభివందనాలు తెలియజేస్తున్నామని అయితే, ప్రభుత్వం తెచ్చిన వెబ్సైట్ ద్వారా తెలంగాణ ఉద్యమకారులకు మంచి గౌరవం దక్కేలా మరియు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు గత ప్రభుత్వం చేయని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది కాబట్టి, ఉద్యమకారులకు మరియు జర్నలిస్టులకు తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనీ నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు ఇంకా పూర్తి స్థాయిలో నెరవేరలేదని.

# ఎకరాకు రూ.20 లక్షల నుండి రూ.30 లక్షలకు పెంచాలి

- లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా స్థానిక చెరువులను నింపాలి
- గ్రామసభలో ఆర్డీవో అనితకు వినతి పత్రం అందజేసిన రైతులు



**బొంరాస్ పేట, అక్టోబర్ 16 (జనం సాక్షి):** మండల పరిధిలోని బొంరాస్పేట్,నాందార్ పూర్ గ్రామాలలో శుక్రవారం మక్తల్,నారాయణపేట,కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాలువల్ల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ కోసం ప్రజాభిప్రాయ గ్రామ సభలను తాండూరు ఆర్డీవో అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు.కాలువ నిర్మాణం చేపట్టడం ద్వారా నష్టపోతున్న రైతుల వివరాలను గ్రామసభ ద్వారా అధికారులు చదివి వినిపించారు.కాలువ నిర్మాణ పనులకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.అనంతరం రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా స్థానిక చెరువులను నింపే విధంగా చూడాలని,మా గ్రామాల నుండి కాలువ వెళుతున్న మా చెరువులను నింపకపోతే ప్రయోజనం లేదని వాపోయారు.నష్టపోతున్న రైతులకు ఎకరాకు ప్రభుత్వం అందజేసే రూ.20 లక్షల నుండి రూ.30 లక్షలకు పరిహారం పెంచాలని తాండూరు ఆర్డీవో అనితకు స్థానిక రైతులు వినతి పత్రం అందజేశారు.గ్రామసభలు పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పద్మావతి,ఆర్ఐ శిరీష, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు వీరేశలింగం,లక్ష్మి,జిపిఓలు రాజు,పుష్పలత,సాయిలు, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.



# క్లోరిన్ లీకేజీపై బహుళ సంస్థల మెగా మాక్ డ్రిల్

**అంతర్గాం, జనంసాక్షి :** క్లోరిన్ లీకేజీపై బహుళ సంస్థల మెగా మాక్ డ్రిల్ నిర్వహించబడింది ఎన్‌టిపిసి రామగుండం అండ్ తెలంగాణ వారి స్టేజ్-1 క్లోరినేషన్ ప్లాంట్‌లో 15 అక్టోబర్ 2026న క్లోరిన్ లీకేజీపై బహుళ సంస్థల మెగా మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించబడింది. అత్యవసర సంసిద్ధత, ప్రతిస్పందన యంత్రాంగాలు, అంతర్-సంస్థల సమన్వయాన్ని అంచనా వేయడానికి, భారీ ప్రాణనష్టం కలిగించే ఒక పెద్ద క్లోరిన్ లీకేజీ సంఘటనను అనుకరించి ఈ డ్రిల్ నిర్వహించబడింది. మొదటి ప్రతిస్పందన బృందంగా, సిఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్, అనుకరించిన అత్యవసర పరిస్థితి గురించి సమాచారం అందిన వెంటనే సహాయక, పునరావాస చర్యలను తక్షణమే ప్రారంభించింది. ఈ డ్రిల్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం, సిఐఎస్ఎఫ్ భద్రతా బృందం, రాష్ట్ర అగ్నిమాపక సేవ, రాష్ట్ర పోలీసులు మరియు రామగుండం అండ్ తెలంగాణ విపత్తు నిర్వహణ ప్రణాళిక (డిఎంపి) బృందాలు చురుకుగా పాల్గొన్నాయి. ఈ డ్రిల్ అత్యవసర ప్రతిస్పందన సమయం, సహాయక మరియు తరలింపు సంసిద్ధత, అత్యవసర పరికరాల లభ్యత, మరియు పాల్గొన్న సంస్థల మధ్య సమన్వయం, సమాచార మార్పిడిని అంచనా వేసింది. బృందాలు సమన్వయంతో కూడిన సహాయక, తరలింపు, పునరావాస చర్యలను ప్రదర్శించి, సుమారుగా మధ్యాహ్నం 12:58 గంటలకు ఈ డ్రిల్‌ను విజయవంతంగా పూర్తి చేశాయి. అనంతరం కమాండెంట్ నవనీత్ కౌర్ మరియు జీఎం (ఓ అండ్ ఎం) మనీష్ అగర్వాల్ అధ్యక్షతన ఒక సమీక్షా సమావేశం నిర్వహించబడింది. పాల్గొన్న బృందాలు చురుకుగా పాల్గొని,



సమన్వయంతో కృషి చేసినందుకు వారిని అభినందించారు. మొత్తం అత్యవసర ప్రతిస్పందన సంతృప్తికరంగా ఉన్నట్లు గుర్తించారు. మెగా మాక్ డ్రిల్‌కు ముందు, ఈడీ అండ్ హెచ్‌ఓపీ (ఆర్ అండ్ టి) ఫైజ్ తయ్యబ్ అధ్యక్షతన ఒక టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించబడింది. ఈ ఎక్సర్‌సైజ్‌కు జీఎంలందరూ, సీఐఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, రాష్ట్ర అగ్నిమాపక సేవ మరియు రాష్ట్ర పోలీసుల ప్రతినిధులతో పాటు డీఎంపీ బృందంలోని కీలక సిబ్బంది హాజరయ్యారు. అనుకరణ అత్యవసర పరిస్థితి, భాగస్వాముల బాధ్యతలు మరియు సమర్థవంతమైన విపత్తు నిర్వహణ కోసం సమన్వయ యంత్రాంగాలపై చర్చలు జరిగాయి. ఈ రెండు ఎక్సర్‌సైజ్‌లను విజయవంతంగా నిర్వహించడం ద్వారా, అత్యవసర సన్నద్ధతను బలోపేతం చేయడానికి, సత్వర ప్రతిస్పందనను నిర్ధారించడానికి మరియు సిబ్బంది, ప్లాంట్ ఆస్తులను కాపాడటానికి వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని పెంపొందించడానికి ఎన్‌టీపీసీ రామగుండం ఉ తెలంగాణ కట్టుబడి ఉన్నాయని మరోసారి స్పష్టమయింది.

# దసరాకు 7 వేల ప్రత్యేక బస్సులు

- టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి
- జూబ్లీ బస్ స్టేషన్‌లో ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎండీ వై.నాగిరెడ్డి





హైదరాబాద్ (జనంసాక్షి) : దసరా పండుగను పురస్కరించుకుని సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) 7 వేల ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు సుమారు 95 శాతం బస్సులను విజయవంతంగా నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చామని వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీ బస్ స్టేషన్‌ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) సిహెచ్. వెంకన్న, ఏ.శ్రీధర్‌లతో కలిసి ఎండీ నాగిరెడ్డి స్వయంగా పరిశీలించారు. జెబీఎస్‌లో ప్రత్యేక విధులు నిర్వర్తిస్తున్న సికింద్రాబాద్ ఆర్ఎం సుచరిత, కరీంనగర్ ఆర్ఎం రాజులతో బస్సుల నిర్వహణ, ట్రాఫిక్ కు సంబంధించి సమీక్షించారు. గంటకు పైగా బస్ స్టేషన్‌లో పర్యటించిన ఆయన ప్రయాణికులతో నేరుగా ముచ్చటించి, వారికి కల్పిస్తున్న ఏర్పాట్లు, సౌకర్యాలు మరియు మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్ స్టేషన్‌లో ప్రయాణికుల కోసం చేసిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎండీ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 17, 18 తేదీల్లో ప్రయాణికుల రద్దీ చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, రద్దీకి అనుగుణంగా అవసరమైన ప్రాంతాల్లో అదనపు బస్సులను నడపాలని అధికారులను ఆదేశించారు. దసరా ప్రత్యేక బస్సుల నిర్వహణలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పండుగ ముగిసిన అనంతరం తిరిగి నగరాలకు చేరుకునే ప్రయాణికుల కోసం కూడా ఇదే తరహాలో ప్రత్యేక బస్సు సర్వీసులను సిద్ధం చేయాలని ఆదేశించారు. బస్ స్టేషన్లలో తాగునీరు, విశ్రాంతి వసతులు, పారిశుధ్యం మరియు భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికులు తమ ముందస్తు రిజర్వేషన్లను అధికారిక వెబ్‌సైట్ www.tgsrtcbus.in ద్వారా బుక్ చేసుకోవాలని కోరారు. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం మరియు వివరాల కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లను సంప్రదించాలని సూచించారు. ప్రయాణికులందరూ టీజీఎస్ఆర్టీసీ సేవలనే వినియోగించుకుని సురక్షితంగా, ప్రశాంతంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని వై.నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# రైస్ మిల్లులపై టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్

- ఆదిబట్ల పరిధిలోని బొంగులూరు 'జయ రైస్ మిల్లులో అక్రమాలు గుర్తింపు
- ఏకకాలంలో 28 జిల్లాల్లో 3వేల మిల్లుల్లో తనిఖీలు
- సీఎంఆర్ ధాన్యం అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్: ఎస్పీ రామ్‌కుమార్ హెచ్చరిక





రంగారెడ్డి , అక్టోబర్ 16 (జనంసాక్షి): రాష్ట్రంలో బియ్యం అక్రమ రవాణా, సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) సేకరణలో అవకతవకలను అరికట్టడమే లక్ష్యంగా సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్, విజిలెన్స్ బృందాలు విరుచుకుపడ్డాయి. సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లోని సుమారు 3,000 రైస్ మిల్లులలో ఏకకాలంలో ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగులూరు వద్ద గల 'జయ రైస్ మిల్లు' పై విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో మిల్లులో భారీగా అక్రమాలు జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

ఈ సందర్భంగా ఎస్పీ రామ్‌కుమార్ పర్యవేక్షణలో బృందాలు మిల్లులోని రికార్డులను, ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యం నిల్వలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. స్టాక్ రిజిస్టర్లకు, క్షేత్రస్థాయిలో ఉన్న ధాన్యానికి భారీ తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ తనిఖీలు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ స్థాయిలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు.

## అక్రమాలు తేలితే పీడీ యాక్ట్, ఆస్తుల జప్తు : విజిలెన్స్ అండ్ టాస్క్ ఫోర్స్ ఎస్పీ రామ్‌కుమార్

ప్రభుత్వం నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యంగా అందించకుండా, కొందరు మిల్లు యజమానులు అక్రమంగా ప్రైవేటు మార్కెట్‌లో విక్రయించుకుంటూ తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని విజిలెన్స్ అండ్ టాస్క్ ఫోర్స్ ఎస్పీ రామ్‌కుమార్ మండిపడ్డారు. ఆదిబట్ల పరిధిలోని బొంగులూరు జయ రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించే వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడమే కాకుండా, పదేపదే అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టమైన ఆదేశాల ప్రకారం.. అక్రమాలకు పాల్పడిన మిల్లు యజమానుల ఆస్తులను సైతం జప్తు చేసేందుకు కూడా వెనకాడబోమన్నారు.

## రూ. 1,400 కోట్ల రికవరీ..

విజిలెన్స్ ,టాస్క్ ఫోర్స్ బృందం గత 3-4 నెలల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1,400 కోట్ల మొండి బకాయిలను రికవరీ చేసిందని, రాబోయే రోజుల్లో బకాయిలు ఉన్న ప్రతి రైస్ మిల్లు నుంచి పూర్తి స్థాయిలో రికవరీ చేపడతామని ఎస్పి రామ్ కుమార్ తెలిపారు. కాగా, ఇప్పటివరకు జరిపిన తనిఖీల్లో వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ స్థాయిలో అవకతవకలు వెలుగుచూసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తూ వ్యవస్థను దెబ్బతీసే ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

# వర్షాభావ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండండి

**ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ**



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితులపై ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాల ని, నీటి పొదుపును ఉద్యమంగా చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపుని చ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులకు బహిరంగ లేఖ విడుదల చేశారు. వర్షపాత లోటు, తగ్గుతున్న జలాశయాల నీటి నిల్వలు, భూగర్భజలాలపై ఒత్తిడి, వ్యవసాయానికి నీటి కొరత వంటి అంశాలు రాబోయే నెలల్లో రాష్ట్రానికి సవాల్‌గా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం జలాశయాల్లో సాధారణంగా 460 టీఎంసీల నీటి నిల్వలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 209 టీఎంసీలే ఉన్నాయని లేఖలో తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని, గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, ఇతర పట్టణాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల్లో నీటి లభ్యతను అంచనా వేయకుండా అధిక నీరు అవసరమయ్యే పంటలను సాగు చేస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో సాగు, విత్తనాల లభ్యత, పంట బీమా, ప్రభుత్వ సహాయంపై వ్యవసాయ అధికారులతో కలిసి అవగాహన కల్పించాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. వర్షాభావం కారణంగా బోర్లపై ఆధారపడటం పెరిగితే భూగర్భ జలాల మట్టాలు పడిపోవడంతో పాటు విద్యుత్ వినియోగం, రైతుల సాగు ఖర్చులు పెరుగుతాయని వివరించారు. రాష్ట్రంలో విద్యుత్ పీక్ డిమాండ్ 20 వేల మెగావాట్లు దాటినట్లు నివేదికలు వెల్లడించాయని ప్రస్తావించారు. నీటి సమస్యను వ్యవసాయం, తాగునీరు, విద్యుత్, గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో ముడిపడిన అంశంగా చూడాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా, మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, రైతుల సాగు పరిస్థితులను సమీక్షించి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. నీటి వృథాను అరికట్టడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టడం, వాస్తవ సమాచారాన్ని ప్రజలకు వివరించడం అవసరమన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు తాగునీరు, పశువులకు నీరు, మేత అందించడంతో పాటు పంటలను కాపాడటంపై దృష్టి పెట్టాలని కోరారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వండి

**సీపీఐ(ఎం) నేతలను కోరిన కాంగ్రెస్ నేతలు**

హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్, ఖమ్మం - నల్లగొండ - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు సీపీఎం మద్దతివ్వాలని టీపీసీసీ అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారులు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయమైన ఎంబీ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి, టి.సాగర్, పోతినేని సుదర్శన్‌రావు, బండారు రవికుమార్‌లతో సమావేశమయ్యారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరడానికి సీపీఎం రాష్ట్ర కార్యాలయానికి వచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో, ఆ తర్వాత ఇతర వామపక్ష పార్టీలతో చర్చించిన తర్వాత తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు.

# గౌడ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

**రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్ (జనంసాక్షి) : గౌడ జాతి విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆకాంక్షించారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూనే, పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. శుక్రవారం నందిగామలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆయన గౌడ హాస్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ హాస్టళ్లు విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడంతోపాటు, ఉన్నత విద్యను అభ్యసించేందుకు దోహదపడతాయని అన్నారు. గౌడ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ హాస్టల్ నుంచి భవిష్యత్తులో సివిల్ సర్వెంట్లు తయారు కావాలని ఆకాంక్షించారు. గౌడ హాస్టల్ నిర్మాణానికి భూమిని దానం చేసిన దొంతి లక్ష్మీనారాయణ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం భూమిని దానం చేయడం గొప్ప విషయమని, ఆయన సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. గౌడ కులస్తుల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గౌడ సంఘాలను బలోపేతం చేస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలని సూచించారు. కోకాపేటలోని భూముల నిర్వహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, హాస్టల్ భవన నిర్మాణానికి తాను ముందుండి సహకరిస్తానని, అవసరమైన ప్రభుత్వ అనుమతుల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గౌడ భవనాలు, హాస్టళ్ల నిర్మాణానికి గౌడ పెద్దలు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన మార్గంలో నడుస్తూ విద్య, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనివ్వాలని, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ ప్రజా ప్రతినిధులు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బుర్ర నర్సయ్య గౌడ్, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్, టీ. వీరేందర్ గౌడ్ మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ గౌడ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ సమన్లు

- మనీ లాండరింగ్ కేసులో అక్టోబర్ 23న విచారణ

తిరువనంతపురం (జనంసాక్షి) : కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ షాకిచ్చింది. సీఎంఎల్ఆర్ మనీ లాండరింగ్ కేసులో నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 23న విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశించింది. మనీలాండరింగ్ కేసులో కేరళ హైకోర్టును ఈడీ ఆశ్రయించింది. దీనిపై స్పందించిన కోర్టు.. ఈ కేసులో మాజీ సీఎం విజయన్‌తోపాటు ఆయన కూతురు వీణా విజయన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేసు విచారణ కోసం కోచిలోని తమ కార్యాలయంలో అక్టోబర్ 23న హాజరు కావాలని విజయన్‌ను ఈడీ ఆదేశించింది. అయితే, తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ విజయన్ శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. ఈ ఏడాది మేలో ఈడీ అధికారులు సీఎంఆర్ఎల్ సంస్థ ప్రమోటర్లపై దాడులు జరిపారు. దీనిలో భాగంగా విజయన్ కూతురు వీణా విజయన్ ఇంటిపై కూడా దాడులు జరిపారు. ఈ సందర్భంగా కొన్ని కీలక డాక్యుమెంట్లు లభించాయి. ఇండియా నుంచి భారీ ఎత్తున డబ్బు దుబాయ్, విదేశాలకు తరలించినట్లుగా ఆ డాక్యుమెంట్లలో ఉంది. 3.49 లక్షల యూఏఈ దిర్హామ్స్ (రూ.85 లక్షలు) దుబాయ్‌కు తరలించారు. అలాగే, ఇండియా నుంచి రూ.20.05 కోట్ల భారత కరెన్సీ కూడా విదేశాలకు తరలించారు. హవాలా లావాదేవీల ద్వారా ఈ సొమ్మును విదేశాలకు తరలించినట్లు ఈడీ అనుమానిస్తోంది. విజయన్ సీఎంగా ఉన్న సమయంలో ఆయన పాత్రపై కూడా ఈ విషయంలో అనుమానాలున్నాయి. ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎల్ సంస్థకు లబ్ధి చేకూరినట్లుగా ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ అంశంపై విచారించేందుకు ఈడీ సిద్ధమైంది. పినరయి విజయన్, వీణా విజయన్‌పై కేసు నమోదు చేయాలని కోర్టును ఈడీ ఆశ్రయించింది.

# పాలన పక్కకు పెట్టి రాజకీయాలా?

- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనబెట్టి కేవలం రాజకీయాలకే పరిమితమయ్యారని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాబోయే రోజుల్లో వరుసగా 7 నుంచి 8 నెలల పాటు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని కవిత స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన క్షేత్రస్థాయిలో పోరాడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఒప్పందాల్లో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన కంపెనీలే ఎక్కువగా ఉన్నాయని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం నిర్వహించే 'గ్లోబల్ సమ్మిట్'ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## మేడిగడ్డను పూర్తి చేయాలి..

సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించిన కవిత, మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖైరతాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన తరపున అత్యంత బలమైన అభ్యర్థిని బరిలోకి దించుతామని, దసరా పండుగ రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామని వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘం కి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న నిరసనలన్నీ డ్రామా అని, అవన్నీ కేవలం "ఫేక్ నిరసనలు" అని కవిత కొట్టిపారేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత పెరగాలంటే రాబోయే ఎన్నికలన్నీ ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్ ద్వారానే నిర్వహించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి.. ఆకాంక్షలు నెరవేరుస్తాం

- తెలంగాణ ఓటర్లకు పవన్ కల్యాణ్ విజ్ఞప్తి



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధనకు ముఖ్య కారణాలు తెలంగాణ యువత బలిదానాలు, వారి పోరాటాలు అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు అయితున్నప్పటికీ ఇంకా ఇక్కడ తీరని కోరికలు, తీరని ఆకాంక్షలు చాలా ఉన్నాయని జనసేన అధ్యక్షుడు, ఏపీడిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ యువత ఆశించింది జనసేన సాధిస్తుందని అన్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారానికి ఉపయోగించే "జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్" ప్రచారం రథంను పవన్ కళ్యాణ్ ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ.. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావును గెలిపించాలని పట్టభద్రులను కోరారు. తానెప్పుడూ ప్రజల పక్షానే నిలబడ్డానని, తెలంగాణలో జనసేన పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని మొట్టమొదటి సారిగా చేతులెత్తి అడుగుతున్నానని అన్నారు.

## తెలంగాణ రాష్ట్రానికి సేవ చూసుకునే అవకాశం..

జనసేన పార్టీని తెలంగాణలోనే స్థాపించినట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ద్వారా మొట్టమొదటి సారి తెలం గాణ రాష్ట్రానికి సేవ చూసుకునే అవకాశం, అదృష్టం లభిస్తోందని అన్నారు. గడల శ్రీనివాసరావుకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్త తరం యువత భవిష్యత్తు కోసం, వారి యొక్క రాజకీయ ఆకాంక్షల కోసం డాక్టర్ గడల శ్రీనివాస రావు ప్రచార రథం ద్వారా ప్రజల్లోకి వస్తున్నట్లు చెప్పారు. 120 రోజుల పాటు ప్రచార రథం ద్వారా ప్రజల్లో తిరుగుతారని, మన తెలంగాణ కోసం ప్రతి ఒక్క పట్టభద్రులు ఈ ప్రచార రథం ఆవశ్యకతను గుర్తించాలని, ప్రచార రథంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల కుర్చీలో కూర్చుని, మీ సమస్యలు, ఆలోచన లను పంచుకుని, ఆకాంక్షలను, ఆశయాలను తెలియజేసి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370